ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
ఆదివారం 27 ఏప్రిల్ 2025



నియోజకవర్గ అభివృద్ధికి ఏటా రూ.100 కోట్లు తెస్తా..
స్పీకర్ అయ్యన్నపాత్రుడు

జాబ్‌మేళాలతో గ్రామీణ యువతకు ఉపాధి
ఎంపీ సీఎం రమేశ్

- 8లో

ఘనంగా నూకాంబిక ఘటాల మహోత్సవం



ఘటాలతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవంలో భాగంగా శనివారం పార్కు జంక్షన్ నుంచి గవరపాలెం మీదుగా ఆలయం వరకు భక్తులు ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాటాలు, నేలవేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

- వార్త 8వ పేజీలో..

శతాబ్ది సందడి



ఏయూ విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.మధుమూర్తి. చిత్రంలో గౌరవ అతిథిగా హాజరైన పాలక్కాడ్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శేషాద్రి శేఖర్, ఏయూ వీసీ జీపీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు, రెక్టార్ కిశోర్‌బాబు

ఏయూ శత వసంతాల వేడుకలు ఘనంగా ప్రారంభం

- ఉదయం బీచ్‌రోడ్డులో వాక్‌థాన్
- సాయంత్రం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రధాన కార్యక్రమం
- అనేక మంది జీవితాలను స్పృశించిందన్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.మధుమూర్తి

... వివరాలు 8వ పేజీలో

అసంపూర్తి భవనాలకు మోక్షం

జిల్లాలో అసంపూర్తిగా 141 అంగన్‌వాడీ భవనాలు

- రూ.9 కోట్ల సీఎస్ఆర్ నిధులతో పూర్తి చేయాలని నిర్ణయం
- త్వరలో పనులు ప్రారంభం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అరకొర నిర్మాణాలతో దర్శనమిస్తున్న అంగన్‌వాడీ భవనాలు త్వరలో పూర్తి కానున్నాయి. జిల్లాలో అసంపూర్తి నిర్మాణాలతో ఉన్న 141 అంగన్‌వాడీ భవనాలకు రూ.9 కోట్ల సీఎస్ఆర్ నిధులు కేటాయించి పూర్తి చేయనున్నారు.



కశింకోట మండలం తాళ్లపాలెంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం



పాయకరావుపేట మండలం పల్మన్‌పేటలో అంగన్‌వాడీ భవనం ఇలా...

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 2014-18 సంవత్సరాల మధ్యలో అప్పటి టీడీపీ ప్రభుత్వం నాబార్డు నిధులతో 250కి పైగా అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను మంజూరు చేసింది. అప్పట్లో దాదాపు అన్ని భవన నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. అప్పట్లో ఎన్నికలు సమీపించే నాటికి బేస్‌మెంట్ స్థాయిలో 7, లింటల్ లెవిల్ 13, రూఫ్‌లెవిల్ 16, శ్లాబ్ లెవిల్ 41, ఫినిసింగ్ స్థాయిలో 64 భవనాలు.. మొత్తం 141 అంగన్‌వాడీ భవనాలు నిర్మాణ పనులు పూర్తికాక వివిధ దశల్లో ... మిగతా 8వ పేజీలో

ఎయిమ్స్ తరహాలో కేజీహెచ్

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా అభివృద్ధి చేస్తాం

- పెద్దాస్పత్రిలో లెవెల్-2 క్యాన్సర్ సెంటర్ ఏర్పాటుకు రూ.60 కోట్లు
- కేజీహెచ్‌లో క్యాన్సర్ సెంటర్
- అనకాపల్లిలో 'నైపర్' సెంటర్...50 ఎకరాలు కేటాయింపు
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు జ్ఞాపిక అందజేస్తున్న కార్యక్రమ నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రవిరాజు. చిత్రంలో మంత్రి సత్యకుమార్, ఆంధ్ర మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు ఉన్నారు

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):
భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేజీహెచ్‌ను ఎయిమ్స్ తరహాలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు విరాళాలతో నిర్మించిన సెంటినరీ భవనాన్ని శనివారం సాయంత్రం ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా గుర్తింపు పొందే సంస్థ ఉన్నత ప్రమాణాలు కలిగి ఉంటుంది. సదరు సంస్థకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది. ప్రభుత్వం ఇచ్చే బడ్జెట్ పెరుగుతుంది) ఏర్పాటుపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆరోగ్య శాఖ ... మిగతా 8వ పేజీలో

ఆర్థిక రాజధానిగా విశాఖ

- గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలు వస్తున్నాయి

రాష్ట్రంలో అత్యధిక తలసరి ఆదాయం ఉన్న, అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతం విశాఖ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. దేశంలో ఎక్కడ పదవీ విరమణ చేసినా నగరంలో స్థిరపడేందుకు ఇష్టపడుతుంటారన్నారు. అందుకే విశాఖను ఆర్థిక రాజధానిగా తయారుచేయాలని సంకల్పించామన్నారు. వచ్చే ఐదేళ్లలో విశాఖ ఎంతగానో అభివృద్ధి చెందుతుందన్నారు. త్వరలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలు వస్తున్నాయన్నారు. గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటవుతుందని, ప్రపంచంలో డేటా మొత్తం ఇక్కడే స్టోర్ చేస్తారని, దీంతో ఈ ప్రాంతం అనేక విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు.

మత్స్యకారులు రియల్ హీరోలు

- హోం మంత్రి అనిత
- జిల్లాలో రూ.25.28 కోట్ల వేట నిషేధ భృతి పంపిణీ



మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం చెక్కు అందజేస్తున్న హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయ్‌కృష్ణన్

నక్కపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):
నిత్యం కడలి కెరటాలపై చేపల వేట సాగించే మత్స్యకారులు రియల్ హీరోలని, వారు ఎటువంటి కల్మషం లేని వారని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం నక్కపల్లిలో కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌తో కలిసి జిల్లాలో 12,644 మందికి పైగా మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.25,28,80,000 వేట నిషేధ పరిహారం చెక్కును ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో వేట నిషేధ పరిహారం రూ.4 వేలు ఇచ్చామని, ఎన్నికల్లో మత్స్యకారులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు దానిని రూ.20 వేలకు పెంచామన్నారు. యాభై ఏళ్ల వయస్సు నిండిన మత్స్యకారులకు పెన్షన్ ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మత్స్యకారులు చేపలు విక్రయించడానికి వీలుగా అడ్డరోడ్డులో ... మిగతా 8వ పేజీలో

మూడు ముళ్లతో బాల్యం బందీ

తల్లిదండ్రులు, బంధువుల సమక్షంలో బాల్య వివాహాలు

- గ్రామీణ ప్రాంతాల్లో అధికం



- ఒకే రోజు నాలుగు పెళ్లిళ్లను అడ్డుకున్న అధికారులు
- వలస కూలీలు ఉన్న ప్రాంతాల్లోనే ఎక్కువ
- పేదరికం, దగ్గర సంబంధాలే కారణమంటున్న అధికారులు
- బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు తప్పవంటున్న వైద్యులు



నర్సీపట్నంలో బాల్య వివాహాన్ని అడ్డుకున్న రూరల్ సీఐ, ఐసీడీఎస్ అధికారులు

నర్సీపట్నం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):
పుస్తకాలతో బడికి వెళ్లాల్సిన ప్రాయంలో పుస్తెలతాడుతో ముడి పెడుతున్నారు. అభంశుభం తెలియని వయస్సులో బాలికలకు మూడు ముళ్ల బంధనం వేస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా కొన్ని బాల్య వివాహాలు జరిగిపోతుండగా, అధికారులకు అందిన సమాచారం మేరకు మరికొన్నింటిని అడ్డుకుంటున్నారు. 2024 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జిల్లాలో 54 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. నర్సీపట్నం, మాకవరపాలెం, కశింకోట మండలాల్లో అధికంగా బాల్య వివాహాలను అడ్డుకున్నారు. నర్సీపట్నం మునిసిపాలిటీ, రూరల్ ప్రాంతంలో 12, మాకవరపాలెంలో ఐదు, కశింకోటలో 8 బాల్య వివాహాలు అడ్డుకున్నారు.

చిన్న వయస్సు పెళ్లి చేస్తున్నారు...కాపాడలని ఫోన్

ఈ నెల 19వ తేదీన నర్సీపట్నం ప్రాంతంలో ఒకేరోజు నాలుగు బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. చెట్టుపల్లి గ్రామానికి చెందిన బాలిక పోలీసులకు, ఐసీడీఎస్ అధికారులకు ఫోన్ చేసి తనకు చిన్న వయస్సులో ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని, వెంటనే వచ్చి ఆపాలని కోరింది. అప్రమత్తమైన అధికారులు బాలిక ఇచ్చిన చిరునామాకు వెళ్లి వివాహాన్ని అడ్డుకొని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు. అదే రోజు మరో మూడు బాల్య వివాహాలను అడ్డుకున్నారు. వాటిలో నర్సీపట్నం మునిసిపాలిటీ అయ్యన్న కాలనీలో ఇంటర్ పాస్ అయిన అమ్మాయికి బాల్య వివాహం చేయాలని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ప్రయత్నించగా, ఐసీడీఎస్ అధికారులకు అందిన సమాచారంతో పట్టణ పోలీసుల సహాయంతో అడ్డుకున్నారు. చిన్న వయస్సులో ఎందుకు పెళ్లి చేస్తున్నారని అధికారులు నిలదీస్తే.... అమ్మాయి ఇంటర్ పరీక్షలు రాసేసిందని, పెళ్లి కొడుకు తల్లికి గుండె జబ్బు ... మిగతా 8వ పేజీలో

డిప్యూటీ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం

తీర్మానానికి 74 మంది సభ్యుల మద్దతు

- పదవి కోల్పోయిన జియ్యాని శ్రీధర్



అవిశ్వాసానికి చేతులెత్తి మద్దతు తెలుపుతున్న దృశ్యం

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):
జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై కూటమి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శ్రీధర్‌పై కూటమి కార్పొరేటర్లు ఇచ్చిన అవిశ్వాసం నోటీసు ఆధారంగా శనివారం జీవీఎంసీ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరిగింది. ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఎన్నికల అధికారి హోదాలో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ ప్రక్రియను నిర్వహించారు. 97 మంది కార్పొరేటర్లు, 14 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు మొత్తం 111 మందికిగాను 74 మంది (2/3 వంతు...కోరం) హాజరుకావడంతో అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నియమ నిబంధనలను సభ్యులకు ఎన్నికల అధికారి వివరించారు. అనంతరం అవిశ్వాసానికి మద్దతు తెలిపే సభ్యులు చేతులెత్తాలని కోరగా, 63 మంది కార్పొరేటర్లు, 11 మంది ఎక్స్‌అఫిషియో సభ్యులు చేతులు ఎత్తారు. అవిశ్వాసానికి వ్యతిరేకించేవారు, తటస్థంగా ఉన్నవారు చేతులెత్తాలని కోరగా ఎవరూ స్పందించలేదు. దీంతో అవిశ్వాసం నెగ్గడానికి అవసరమైన 74 మంది మద్దతు లభించడంతో డిప్యూటీ మేయర్ పదవిని శ్రీధర్ కోల్పోయినట్టు జిల్లా కలెక్టర్ ప్రకటించారు.

డోలీ మోతలు ఇంకెన్నాళ్లు?

- అనారోగ్యానికి గురైన బాలుడిని ఆరు కిలోమీటర్లు డోలీలో తరలించాల్సిన దుస్థితి
- అధికారులు స్పందించాలని గిరిజనుల వేడుకోలు

నీళ్లబంధ గ్రామానికి రహదారి సౌకర్యం లేక అవస్థలు



అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడిని డోలీలో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రోలుగుంట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):
మండలంలోని అర్ల పంచాయతీ శివారు నీళ్లబంధ గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో డోలీ మోతలు తప్పడం లేదు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆరు కిలోమీటర్లు డోలీలో తరలించాల్సి వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఈ గ్రామానికి చెందిన బాలుడిని శనివారం డోలీలో ఆస్పత్రికి తరలించాల్సి వచ్చింది.

కొయ్యూరు మండలం చిట్టింపాడు ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో 4వ తరగతి ... మిగతా 8వ పేజీలో

తాడి తరలింపునకు సర్వే ప్రారంభం

ఎనిమిది బృందాలతో ఇంటింటా సర్వే

- పారదర్శకంగా నిర్వహించి నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తాం
- తహసీల్దార్ అంబేడ్కర్



ఇంటింటా సర్వే చేపడుతున్న అధికారులు

పరవాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):
ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామం తరలింపునకు రెవెన్యూ అధికారులు శనివారం సర్వే ప్రక్రియను ప్రారంభించారు. ఈ సర్వే కోసం ముగ్గురు అధికారులతో కూడిన ఎనిమిది బృందాలను ఏర్పాటు చేశారు. తాడి బీసీ కాలనీ, చినతాడి, పెదతాడి గ్రామాల్లో ఈ బృందాలు ఇంటింటికి వెళ్లి సర్వే చేపడతాయని తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్ తెలిపారు. సర్వే పారదర్శకంగా జరుపుతామన్నారు. వారం నుంచి పది రోజుల్లోగా సర్వేను పూర్తి చేస్తామన్నారు. ఎన్ని ఇళ్లు, మేజర్ సన్స్, మేజర్ డాటర్స్ వంటి విషయాలను సర్వేలో ప్రధానాంశాలుగా తీసుకున్నారు. కాగా సర్వే ప్రారంభానికి ముందు తాడి బీసీ కాలనీలో జనసేన మండల ఇన్‌చార్జి ... మిగతా 8వ పేజీలో

కోర్టు సముదాయాన్ని పరిశీలించిన జిల్లా జడ్జి



శిథిలమైన కోర్టు సముదాయ భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి రాజు

ఎలమంచిలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కోర్టు సముదాయాన్ని ఉమ్మడి జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా శిథిలావస్థకు చేరిన కోర్టు సముదాయ భవనం వివరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, ఎల్‌వీ రామకృష్ణ, న్యాయవాదులు కూనిశెట్టి శ్రీనివాసరావు, పీవీరమణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ : ప్రగడ



బీమా పత్రాలు అందజేస్తున్న ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు

ఎలమంచిలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఇక్కడి పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం పలువురు కార్యకర్తలకు బీమాకు సంబంధించిన పత్రాలను మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావుతో కలిసి అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ కార్యకర్తల శ్రేయస్సుకు పార్టీ అధిష్ఠానం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రతి కార్యకర్త సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని సూచించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ క్రమశిక్షణకు టీడీపీ కార్యకర్తలు మారుపేరుగా పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్, నాయకులు లాలం భరత్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ ఆధునికీకణ పనులు పరిశీలించిన సీఎండీ



సబ్‌స్టేషన్‌కు విచ్చేసిన సీఎండీ పృథ్వీరాజ్

మునగపాక, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా జరగాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇపృథ్వీరాజ్ ఆదేశించారు. మునగపాక గల విద్యుత్ సబ్ స్టేషన్‌కు శనివారం ఆయన విచ్చేశారు. ఇక్కడ జరుగుతున్న ఆధునికీకరణ పనులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయం, గృహ వినియోగదారులకు వేర్వేరుగా విద్యుత్ సరఫరా చేసేందుకు చేపట్టిన పనులుపై ఆరా తీశారు. ఆయన వెంట డీఈ రామకృష్ణ, ఏడీఈ ఎన్.సురేష్, స్థానిక ఏఈ ఎస్.జగదీశ్ ఉన్నారు.

విపత్తుల వేళ సహాయక చర్యలపై మాక్‌డ్రిల్

▸▸ కళ్లకు కట్టినట్టు చూపిన ఎన్డీఆర్‌ఎఫ్ బృందం



నదుల్లో బోట్లు ప్రమాదానికి గురైనప్పుడు సహాయక చర్యలను ప్రదర్శిస్తున్న సిబ్బంది



కార్యక్రమానికి హాజరైన అనకాపల్లి ఆర్డీవో ఆయేషా, వివిధ శాఖల అధికారులు

రాంబిల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై మండలంలోని పంచదార్ల గ్రామంలోని కోనేరు వద్ద శనివారం రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. విపత్తులు, అగ్నిప్రమాదాలు, వరదలు సంభవించినప్పుడు, నదుల్లో బోట్లు ప్రమాదాలకు గురైనప్పుడు ఎలా కాపాడాలో సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయేషా, ప్రత్యేకాధికారిణి వి.నాగలక్ష్మి, డీపీవో శిరీషారాణి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో జయమాధవి, రాంబిల్లి సీఐ నర్సింగరావు, ఎలమంచిలి మునిసిపల్ కమిషనర్ ప్రసాద్‌రాజు, ఎస్డీఆర్ఎఫ్ ఆర్ఐ టి.రామకృష్ణ, ఆర్ఎస్ఐ బి.జగన్, ఆర్ఐ రవికుమార్, సీఎస్‌డీటీ సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.ఇదిలావుంటే, కర్మాగారాల్లో భద్రత, ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై కార్మికులు అవగాహన కలిగి ఉండాలని ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జీవీవీఎస్ నారాయణ అన్నారు. ఎస్ఈజెడ్ పరిధిలో గల నవోపోర్ అడ్వాన్స్ సైన్స్ ప్రవేట్ లిమిటెడ్ కంపెనీలో శనివారం ప్రమాదాలపై ఎన్డీఆర్ఎఫ్ బృందం, సెజ్‌లోని అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులు నిర్వహించే సమయంలో అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం క్లోనిన్ గ్యాస్ లీకైతే ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఉత్పన్నమవుతాయి, ఎలా ఎదుర్కోవాలో మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ వీవీ ముకుందరావు, జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్.వెంకటరమణ, ఎస్ఐ నాగేంద్ర, నవోపోర్ కంపెనీ ఈహెచ్ఎస్ ఆఫీసర్ ప్రవీణ్‌గౌడ్ తదితర అధికారులతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని తుదిముట్టించాలి

▸▸ పహల్గాం ఘటనలో మృతులకు పలు చోట్ల నివాళి



మునగపాకలో కొవ్వొత్తులు చేతబట్టి ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు



కొండకర్ల జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ గణేశ్, సిబ్బంది

మునగపాక, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పాక్ ఉగ్రవాదాన్ని భారతీయులంతా ముక్త కంఠంతో ఖండించాలని గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్ పిలుపు నిచ్చారు. కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల చేతిలో హతమైన పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలని పార్థిస్తూ శనివారం రాత్రి మునగపాకలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్రం కఠిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు దాడి ముసిలినాయుడు, టెక్కలి పరశురాం, ఆడారి గణపతి అచ్చింనాయుడు, మళ్ల జోగారావు, ఆడారి లక్ష్మణరావు, కాశిబాబు, సూర్యచంద్రరామారావు, దాడి శివ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన పర్యాటకులకు సంతాపంగా గణపర్తి గ్రామంలో పార్టీలకు అతీతంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాళ్ల చంద్రమౌళి, ఎం.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం మండలంలో నాకాబందీ

అచ్యుతాపురం/ రూరల్ : కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు అచ్యుతాపురం సీఐ నమ్మి గణేశ్ ఆధ్వర్యంలో శనివారం పలుచోట్ల నాకాబందీ నిర్వహించారు. పోలీసులు బృందాలుగా విడిపోయి కొండకర్ల జంక్షన్, బార్క్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేశారు. బస్సుల్లోనూ ప్రయాణికుల వివరాలు సేకరించారు. అలాగే, అచ్యుతాపురంలో గల హోటళ్ల, లాడ్జిల్లో కూడా తనిఖీలు నిర్వహించారు. ఎక్కడైనా అపరిచిత వ్యక్తులు సంచరించినా, అనుమానంగా వస్తువులు కనిపించినా వెంటనే తమకు పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని అందరికీ సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

నేడు గంధం అమావాస్య జాతర

ఎలమంచిలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఆదివారం గంధం అమావాస్య జాతర జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వేకువజామున అమ్మవారికి విశేష అలంకరణలు, పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

సెల్ టవర్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన

మునగపాక, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : సెల్ టవర్ వలన అనేక ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నందున ఏర్పాటు చేయవద్దని మునగపాకకు చెందిన పలువురు నివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సెల్ టవర్ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎం.ఎం.నాయుడు, టెక్కలి గంగరాజు, ఆడారి జోగిశ్రీనివాసరావు, టెక్కలి హేమంత్ తదితరులు మాట్లాడుతూ జనావాసాల మధ్య సెల్‌టవర్ నిర్మాణం తగదన్నారు. ఈ పనులు కొనసాగితే కుటుంబాల సమేతంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో ఆడారి ప్రసాద్, సోమునాయుడు, మహిళలు పాల్గొన్నారు.

రామాలయానికి భజన సామగ్రి

ఎలమంచిలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కొత్తపేటలోని పురాతన సీతారాముల ఆలయానికి చెందిన భజన బృందానికి రిటైర్డు తహసీల్దార్ కొఠారు శ్రీనివాసరావు శనివారం భజన సామగ్రిని వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా భజన మండలి భక్తులు చిన్నారావు, రిటైర్డు పోస్టల్ ఉద్యోగి జోగినాథం ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు చెల్లించాలి

ఎలమంచిలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్.శివాజీ డిమాండ్ చేశారు. ఏటికొప్పాకలో ఉపాధి పనులు చేపడుతున్న కూలీలను శనివారం కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

బార్క్ పనులను అడ్డుకున్న నిర్వాసిత రైతులు



పనులను అడ్డుకుంటున్న రైతులు

అచ్యుతాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తమకు పరిహారం ఇచ్చే వరకు పనులను అడ్డుకుంటామని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) నిర్వాసిత రైతులు తెలిపారు. శనివారం పనులను వీరు అడ్డుకున్నారు. బార్క్‌కి రావిపాలెం, దోసూరు గ్రామాల నుంచి గతంలో భూమిని సేకరించారు. జిరాయితీకి పరిహారం ఇచ్చేశారు. కానీ డిపట్టాలకు పరిహారం ఇవ్వలేదు. దీనిపై ఇప్పటికే పలుమార్లు రైతులతో అధికారులు చర్చలు జరిపారు. ఎంత పరిహారం ఇస్తారన్న విషయం అధికారులు ప్రకటించలేదు. ఎకరాకి 60 లక్షలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. కమిటీని వేసి ధర నిర్ణయించిన తర్వాతే పనులు ప్రారంభించాలని రైతులు పలుమార్లు కోరారు. కానీ అధికారులు మాత్రం కమిటీని నియమించలేదు. పరిహారం విషయం తేల్చలేదు. శనివారం రావిపాలెం-దోసూరు సరిహద్దుల్లో గల డిపట్టా భూముల్లో పనులను ప్రారంభించారు. దీనిని రైతులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కొఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్‌తో పాటు నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

మత్స్యకారుల భృతి పెంపు అభినందనీయం



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్ర భుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఇచ్చే భృతిని రెట్టింపుచేయడం అభినందనీయమని మండలంలో వెంకటనగరానికి చెందిన టీడీపీ నాయకుడు వంకా శివ కుమార్ అన్నారు. శనివారం భృతి పెంపుపై గ్రామంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఇచ్చే భృతిని రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచి అందిస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గరికిన అప్పారావు, వంకా గోపి, పారా గాలిబాబు, వంకా హరి, మల్లె రాంబాబు, గరికిన శ్రీను, మేరుగు రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి



ప్రకృతిసాగు ప్రయోజనాలపై బ్యానర్లను ప్రదర్శిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎ. జయప్రకాశరావు తెలిపారు. శనివారం స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవ సాయ అనుబంధ శాఖల సిబ్బందికి మండలస్థాయి శిక్షణ కా ర్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటుచేసిన ప్రదర్శనను ఎంపీడీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సాగుతో పెట్టుబడులు గణనీ యంగా తగ్గడంతోపాటు భూసారం పెరిగి ఆరోగ్యకర పంటలు దిగుబడి వస్తాయన్నారు. ముందుగా శిక్షణ తరగతుల్లో ఏపీసీఎన్ఎఫ్ రిసోర్స్ పెర్సన్ గోవిందు మా ట్లాడుతూ ప్రకృతి సాగుతో లాభాలను డ్వాక్రా సంఘాల సభ్యుల ద్వారా రైతులకు తెలియజేసేలా వివరించారు. ఏఓ ఆదినారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది ఆర్‌ఎస్‌కే సిబ్బంది ఒక్కొక్కరు 55 చొప్పున మండల గ్రామాల్లో 1210 మట్టి నమూనాలను తీసి అనకాపల్లి వ్యవసాయ పరీక్షా కేంద్రానికి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం దేవతారెడ్డి, ఏఈఓ జోత్స్న, వీఏఏలు, వీహెచ్ఏలు, ఏపీసీఎన్ఎఫ్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

34 మంది హెచ్‌ఎంలకు మెమోలు

పాడేరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వ్యాప్తంగా పదో తరగతిలో ఉత్తీర్ణత 80శాతం కంటే తక్కువగా ఉన్న 34 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మెమోలు జారీ చేసినట్టు డీఈవో పి.బ్రహ్మాజీరావు తెలిపారు. రాష్ట్ర సగటు ఫలితాలు కన్నా తక్కువ శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలను దృష్టిలో పెట్టుకొని ఈ మేరకు సంజాయిషీ కోరుతూ ఈ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. అలాగే, సబ్జెక్టుల వారీగా 80 శాతం కంటే తక్కువ ఫలితాలు సాధించిన ఆయా ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. అలాగే, సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు ఈ నెల 28వ తేదీ నుంచి జరగనున్న క్లాసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.



పందూరులో వంతెనకు శంకుస్థాపనచేస్తున్న మంత్రి అనిత



అనితతో ముచ్చటిస్తున్న గ్రామానికి చెందిన మహిళలు

మీ రుణం తీర్చుకోలేం

▸▸ వంతెన నిర్మాణంతో మా పిల్లలకు పెళ్లిళ్లు కానున్నాయి

▸▸ శంకుస్థాపన సభలో హోంమంత్రి అనిత ఎదుట పందూరు మహిళల భావోద్వేగం

కోటవురట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 'మీ మేలు జీవితాంతం మరువలేం.. మీదయ వల్లే వంతెన పూర్తితో మా ఊర్లోని పిల్లలకు ఇకనుంచి పెళ్లిళ్లు అవుతాయి' అని పందూరు గ్రామస్థులు హోంమంత్రి వంగలపూడి అనితకి ఎదుట ఆనందంతో కృతజ్ఞతలు తెలిపారు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి అనిత పందూరును సందర్శించారు. అప్పట్లో గ్రామానికి వంతెన మంజూరు చేసిన తర్వాతే మీ గ్రామానికి వస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం వంతెన పనులు ప్రారంభించడానికి ఆమె గ్రామానికి వెళ్లారు. ఈసందర్భంగా ఆమె మంత్రి అనితగ్రామస్థులతో ఆనందాన్ని పంచుకున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంవల్ల వంతెనపూర్తి కాలేదన్నారు. ఈస్థితిలో రామచంద్రపురం జంక్షన్ నుంచి వరహానదిపై రూ. 5.75 కోట్లతో పందూరుగ్రామానికి వంతెన మిగులు పనులకు మంత్రి వంగలపూడి అనిత శంకుస్థాపనచేశారు. ఈ నేపథ్యంలో మంత్రి అనిత పందూరు గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్థులంతా ఆమెను అడుగడుగునా పూలమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ వరహానదిపై వంతెన లేక తమ ఆడపిల్లలను బయట గ్రామాల వారు వివాహాలు చేసుకునేందుకు ఎవరు వచ్చేవారు కాదు. పిల్లలు సైతం బడి మానేసి వ్యవసాయం పనులకు పోతున్నారు.. ఎవరికైనా రాత్రి సమయంలో అనారోగ్యం చేసినా ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. పదేళ్ల నుంచి రాజకీయ నేతలు ఓట్ల కోసం వచ్చినా వంతెన కోసం పట్టించుకోలేదు.. మీరు ఇచ్చిన మాట ప్రకారం వంతెనతోపాటు రోడ్డు నిర్మిస్తున్నారు.. మీ మేలు.. మీ పార్టీకి రుణపడి ఉంటాం అంటూ మహిళలు మంత్రికి చేతులు జోడించి నమస్కరించారు, ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇలాం టి చిన్న గ్రామానికి రూ. 5.75 కోట్లు వెచ్చించడం కష్టం, గతంలో తాను అయ్యన్నపాత్రుడు, లోకేశ్ బాబు మీకోసం ఒప్పించి రూ. 6 కోట్లు మంజూరు చేయించా.. మిగులు పనులకు మరో రూ. 5.75కోట్లు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా పార్టీ ప్రధానకార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు జానకీశ్రీనివాసరావు, వేచలపు జనార్దన్, సర్పంచ్ జగదీశ్, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు నూకాంబిక జాతర

▸▸ కళకళలాడుతున్న ఆలయాలు



విద్యుత్‌దీపాల అలంకరణలో రావికమతం ఆలయం



అమ్మవారు

ఎస్. రాయవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గంధమావాస్యను పురస్కరించుకుని ఆదివారం నూకాంబిక మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ జాతర నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు. ప్రధానంగా ఎస్. రాయవరం, కొరుప్రోలు, పేటసూదిపురం గ్రామాల్లో నూకాంబిక జాతరను ఎంతో వైభవంగా జరపనున్నారు. ఆలయాలతో పాటు ఆయా గ్రామాల్లో గల పలు వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో కళకళలాడుతున్నాయి. గ్రామాల్లో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాటు చేశారు. మండల కేంద్రమైన ఎస్. రాయవరంలో జరిగే జాతర పెద్దది కావడంతో ఇక్కడికి అధికసంఖ్యలో జనాలు అమ్మవారిని సందర్శించుకోనున్నారు.

నక్కపల్లి సంతలో షెడ్ల నిర్మాణానికి హామీ



అగ్ని ప్రమాద బాధితుల సమస్యను తెలుసుకుంటున్న హోం మంత్రి

నక్కపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన నక్కపల్లి వారపుసంతలో రైతు బజారును తలపించే విధంగా పటిష్టమైన షెడ్లు నిర్మించాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన వారపుసంతను శనివారం మధ్యాహ్నం హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయ్ కృష్ణన్ పరిశీలించారు. నక్కపల్లిలో ప్రతీ శుక్రవారం జరిగే ఈ వారపుసంత రాష్ట్రంలోనే పెద్దదని, దుకాణాలన్నీ కాలిపోవడం వల్ల వ్యాపారులు ఎవరూ రావడం లేదని టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, కొప్పిశెట్టి కొండబాబు హోం మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ స్థితిలో వ్యాపారులను ఆదుకోవాలని కోరారు. దీనిపై హోం మంత్రి అనిత స్పందించారు. తక్షణమే ఇక్కడ వ్యాపారం సాగించే వారికి పటిష్టమైన షెడ్లు నిర్మించాలని, ఈ మేరకు అంచనాలు తయారు చేయాలని ఎంపీడీవో సీతారామరాజును ఆదేశించారు.

గూడుపమ్మ ఆలయ గర్భగుడికి డోర్స్ వితరణ



లయ గర్భగుడికి టేకు డోర్లు ఏర్పాటు చేసిన దృశ్యం

నక్కపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మతల్లి క్షేత్రంలోని గర్భగుడికి యలమంచిలికి చెందిన త్రిపరాల రాము టేకు చెక్కలతో తయారు చేసిన తలుపులు బహూకరించారు. శనివారం ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు సమక్షంలో ఈ డోర్లను ఏర్పాటు చేశారు. సుమారు రూ.30 వేలు విలువైన డోర్స్ అందచేసిన రామును పలువురు పెద్దలు అభినందించారు.

గ్రంథాలయంలో రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

పాయకరావుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానాన్ని అందజేసేందుకు ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు తెలిపారు. సోమవారం నుంచి కొనసాగే ఈ శిబిరాల్లో అన్ని తరగతుల విద్యార్థులకు పుస్తకాలు చదవడం, స్పోకెన్ ఇంగ్లీషు, సబ్జెక్ట్‌పై అవగాహన, చిత్రలేఖనం, యోగా, ఆటపాటల్లో రిసోర్స్ పర్సన్స్‌తో శిక్షణ అందిస్తామన్నారు. పోటీ పరీక్షల సన్నధతను వివరిస్తామన్నారు. గ్రంథాలయాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తామని వీటిపై పోటీలు నిర్వహించిన ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. అన్ని పాఠశాలలో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో పోలీసుల తనిఖీలు



పాడేరులో వివరాలు సేకరిస్తున్న సీఐ జి.అప్పన్న

ఎస్. రాయవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీరులో జరిగిన ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో మండలంలోని పలు చోట్ల శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నర్సీపట్నం డీఎస్పీ పి శ్రీనివాసరావు పాల్గొని స్థానిక పోలీసులకు, ఎన్ఏవోబీ పోలీస్ సెక్యూరిటీకి పలు సూచనలు చేశారు.రైల్వే స్టేషన్‌లో డ్రోన్ కెమెరాతో పరిశీలించారు. అనంతరం రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఎస్ఐ విభీషణరావు పాల్గొన్నారు.

కోటవురట్లలో

కోటవురట్ల: ఇటీవల జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడుల నేపథ్యంలో మండలంలో పలుచోట్ల ఎస్ఐ రమేశ్ ఆధ్వర్యంలో ముమ్మరంగా వా హ నాలు తనిఖీలుచేపట్టారు.కోటవురట్ల, పాములవాక పట్టాలమ్మ గుడి సమీపంలో, కే వెంకటాపురం తదితర ప్రాంతాల్లో వాహనాలనునిలిపి రికార్డులను పరిశీలించారు. ప్రయానికుల లగేజీలను తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

'పేట'లో తనిఖీలు



బంగారమ్మపాలెం ఎన్ఏవోబీ వద్ద సూచనలు చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పాయకరావుపేట: కాశ్మీరులో ఉగ్ర మూకల దాడుల నేపథ్యంలో శనివారం సాయం త్రం పాయకరావుపేట లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సీఐ జి.అప్పన్న సిబ్బందితో పలు ప్రాంతాల్లో విస్తృతంగా వాహనాలను తనిఖీ చేయడంతోపాటు అనుమానితుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు చేపట్టిన తనిఖీల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించామని తెలిపారు.

పాత కోర్టు భవనాన్ని పరిశీలించిన జిల్లా జడ్జి రాజు



పాత కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయమూర్తి రాజు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాత కోర్టు భవనాన్ని ఉమ్మడి జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు శనివారం పరిశీలించారు. అనకాపల్లి కోర్టు ప్రస్తుతం అద్దె భవనంలో నడుస్తున్న సంగతి తెలిసిందే. బార్ అసోసియేషన్ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు అనకాపల్లిలో నూతన కోర్టు భవనాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో ఆయన ఈ పరిశీలన జరిపారు. నెహ్రూచౌక్ సమీపంలో ఉన్న పాత కోర్టు భవనం పనికివస్తుందా.. లేదా.. అన్న అంశంపై ఆరా తీశారు. ఇంజినీరింగ్ ఉన్నతాధికారులతో మాట్లాడిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. కోర్టు భవన నిర్మాణానికి సంబంధించి సమన్వయంతో ముందుకు వెళదామన్నారు. ఈ కార్యక్రమంలో పదవ అదనపు జిల్లా జడ్జి వి.నరేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమేష్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమార్, సెక్రటరీ దుర్గారావు, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఇక్కడికి విచ్చేసిన జిల్లా జడ్జిని ఎస్పీ తుహిన్‌సిన్హా మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

టెన్త్ ఫలితాల్లో ఉత్తమ విద్యార్థినికి ఘన సత్కారం



విద్యార్థిని గగనశ్రీని సత్కరిస్తున్న కమ్మాస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో 593 మార్కులు సాధించిన ఉమ్మనేని గగనశ్రీని కమ్మాస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు కాకర్ల రమేష్‌బాబు, కొల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృషి చేస్తూ, క్రమం తప్పకుండా ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి పాదచారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రాఘవరావు, ధనాల వెంగళరావు, పార్వతి, శ్రీనివాస్, గొల్ల రాఘవుల నాయుడు, గొట్టిపాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై ఆర్టీసీ కార్మికుల నిరసన

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో పలువురు కార్మికులు శనివారం డిపో ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన తెలియజేశారు. 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అలాగే కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కేఎస్‌వీ రమేష్, ఏఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఆకతాయిల బెడద

పరవాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. కాలనీలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తరచూ దొంగతనాలు జరుగుతుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. అర్థరాత్రి సమయంలో కొంతమంది యువకులు గంజాయి, మద్యం సేవించి హడావుడి సృష్టిస్తున్నారని వాపోయారు. వీరి ఆగడాలు వలన కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలీసులు తక్షణమే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో ఐద్వా ప్రతినిధులు సీతామహాలక్ష్మి, మాధురి, వరలక్ష్మి, లావణ్య, గాయత్రి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి'

సబ్బవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు కోరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం గొటివాడ, పెదయాతపాలెం, బొండావానిపాలెం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు పలువురు ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీఈపీడీసీఎల్ అభివృద్ధి పనులపై సమీక్ష



సంస్థ చైర్మన్ పృథ్వీతేజ్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

కశింకోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులపై చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా మంజూరైన అదనపు బ్రేకర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. మునగపాక మండలంలోని ఆర్‌డీఎస్ఎస్ స్కీం ద్వారా మంజూరైన అదనపు బ్రేకర్లను, లైన్లను నేరుగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కశింకోట డివిజన్ ఈఈ రామకృష్ణ, చీఫ్ జనరల్ మేనేజర్, ప్రాజెక్ట్స్, ఏపీఈపీడీసీఎల్, రెస్కో ప్రాజెక్టు ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, శానిటేషన్ సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇక్కడి యూనియన్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. తక్కువ జీతంతో పనిచేస్తున్న వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పని భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, శ్రీదేవి, బీబీ, శివలక్ష్మి, జానకి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై విస్తృత ప్రచారం : ఏడీఏ

కశింకోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సిబ్బంది అనుసరించాల్సిన విధానాలపై ఇక్కడి వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ ఎం.రామారావు పలు సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేసేందుకు ప్రజల్లో ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మట్టి నమూనాల సేకరణపై రైతుల వద్దకు వెళ్లి ప్రత్యక్షంగా సేకరణ అంశాలను వివరించాలన్నారు. రానున్న కాలంలో కౌలుదారులంతా రైతు సేవా కేంద్రాల ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని వివరించారు. అనంతరం పీఎం కిసాన్ పథకం మార్గదర్శకాలను రైతులకు వివరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కశింకోట మండల వ్యవసాయాధికారిణి మాగాపు స్వప్నతో పాటు అనకాపల్లి, మునగపాక, సబ్బవరం, పరవాడ మండలాల వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులు, వీపీఏలు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందిస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు



యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మౌనం పాటిస్తున్న ఉద్యోగులు

ఉగ్రదాడిపై పెల్లుబికిన నిరసన

▸▸ అనకాపల్లిలో పలు చోట్ల ర్యాలీలు ▸▸ మృతులకు నివాళులు ▸▸ దుశ్చర్యకు పాల్పడినవారి భరతం పట్టాలని అధికారులకు వినతులు





అనకాపల్లిలోని మార్కెట్ యార్డు, పరమేశ్వరీ పార్కులలో మృతులకు సంతాపం తెలియజేస్తున్న వాకర్స్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తూ అనకాపల్లిలోని పలుచోట్ల వాకర్స్, బ్యాంక్ ఉద్యోగులు, జర్నలిస్టులు శనివారం నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో తొలుత ర్యాలీ చేపట్టారు. ఉగ్రదాడిలో మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ కాండ్రేగుల గంగరాజు, బొడ్డేడ మోహన్, కాండ్రేగుల నూక రామలింగస్వామి, కాండ్రేగుల ఆదిబాబు, శిలపరశెట్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. గవరపాలెంలోని పరమేశ్వరి పార్కు జంక్షన్‌లో పార్కు వాకర్స్ పహల్గాం సంఘటనపై నిరసన తెలిపారు. పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అలాగే, మెయిన్ రోడ్డులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో ఉద్యోగులు ఉగ్రవాదుల దాడిని ఖండించారు. మృతులకు సంతాపంగా మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల హరికృష్ణ, దాసరి రమేష్, నానాజీ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అనకాపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆర్డీవో కార్యాలయంలోని మహాత్ముని విగ్రహానికి ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మళ్ల భాస్కరరావు, భీమరశెట్టి గణేష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉగ్రవాదుల దుశ్చలను ఖండించారు. అనంతరం పట్టణంలోని ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గసభ్యులు మద్దాల రాంబాబు, అనకాపల్లి ప్రెస్‌క్లబ్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు చాగంటి అవతారం, భీమరశెట్టి నూకేష్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి ఆళ్ల వెంకట అప్పారావు, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు శిలపరశెట్టి ప్రసాద్, యల్లపు రమణాజీ, భానోజీరావు, కర్రి గంగాధర్, మణికుమార్, జనార్దన్, శివాజీ, ఫోటో జర్నలిస్టు రవ్వా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



తాళ్లపాలెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఇందులో భాగంగా మండలంలోని తాళ్లపాలెం, అచ్చెర్ల గ్రామ కూడళ్లలో శనివారం సీఐ అల్లు స్వామినాయుడు బృందం వాహనాల తనిఖీ చేపట్టింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీంచారు. అలాగే పలుచోట్ల బస్సుల్లో ప్రయాణిస్తున్న వారి వివరాలను నమోదు చేసుకున్నారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా ఎవరైనా సంచరించినా, ఎటువంటి ఆయుధాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా సీఐ ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.



సబ్బవరంలో వాహనదారుడి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ

సబ్బవరంలో...

సబ్బవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ విష్ణు స్వరూప్ పర్యవేక్షణలో సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే, ముఖ్య ప్రాంతాలు, రహదారులు, ఆర్టీసీ కాంప్లెక్స్, సినిమాహాల్, రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పి.సింహాచలం మాట్లాడుతూ సిబ్బందిని మూడు బృందాలుగా విభజించి జాతీయ రహదారి మర్రిపాలెం టోల్ గేటు, కోటపాడు రోడ్డులోని గుల్లేపల్లి చెక్‌పోస్టు, చోడవరం రోడ్డు లింగాలతిరుగుడు వద్ద పౌరులకు ఇబ్బంది లేకుండా తనిఖీలు చేపట్టామన్నారు.

నలుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

కశింకోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నూతనగుంటపాలెం, ఏనుగుతుని, సోమవరం, ఏఎస్‌పేట గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలు శనివారం జరిగాయి. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర హాజరై మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం నలుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ.ఐదు లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. నాయకులు ఉగ్గిన రమణమూర్తి, కాయల మురళీ, గొంతిన శ్రీనివాసరావు, కాయల మురళీ, వేగి గోపీ, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, తాతిలనాయుడు, షేక్ బాబర్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

▸▸ కశింకోట మండల సమావేశంలో సభ్యులు విజ్ఞప్తి

కశింకోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని పలు గ్రామాల సర్పంచులు కోరారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యతన కశింకోట మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. ప్రధానంగా వేసవిలో విద్యుత్, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే 24 గంటల్లో పరిష్కరించాలని సూచించారు. అలాగే, పారిశుధ్య సమస్య, వీధిలైట్ల నిర్వహణపై కార్యదర్శులు ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి, పీఆర్ డీఈ వేణుగోపాల్, వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, మీనా, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు.



సమావేశంలో సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



హనుమాన్ శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ సీఎం రమేశ్

కొత్తూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని సుంకరమెట్ట కూడలి నుంచి నెహ్రూచౌక్ జంక్షన్ వరకు హనుమాన్ శోభాయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ సీఎం రమేశ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేలాది మంది భక్తులతో కలిసి నడుస్తూ జైశ్రీరామ్ నినాదాలు చేశారు. కార్యక్రమంలో చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, విశ్వహిందూ పరిషత్ నాయకులు, జనసేన చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆయకట్టు రైతుల వినతి

సబ్బవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పెదనాయుడు చెరువు పరిధిలోని ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని పలువురు శనివారం తహసీల్దార్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయా రైతులు మాట్లాడుతూ విశాఖ- రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి సబ్బవరం శివారు పెదనాయుడుపాలెం వద్ద భూములు సేకరించారన్నారు. సదరు భూములకు ఆనుకొని దిగువన పెదనాయుడు చెరువు సుమారు 20 ఎకరాల్లో విస్తరించి ఉందన్నారు. ఈ చెరువుకు అనుకొని రింగురోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా పెదనాయుడు చెరువును పూడ్చేసి సర్వీసు రోడ్డు నిర్మాణం చేస్తున్నారన్నారు. రెండు నెలలు క్రితం నిర్మాణం పనులు అడ్డుకోగా, స్థలానికి స్థలం సేకరించి, చెరువు గర్భం పాడవ్వకుండా చర్యలు చేపడతామని ఇంజనీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చినా మళ్లీ మళ్లీ అక్కడ పనులు చేపడుతున్నారని న్యాయం చేయాలని కోరారు. ఎంపీటీసీ భైలపూడి దేముడుబాబు, ఎస్.నాగేంద్ర, పంచాడ గోపాల్, కొండలరావు, కిల్లి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి దాడి



చంద్రమౌళి కుటుంబ సభ్యునితో మాట్లాడుతున్న దాడి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జమ్ము కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో అమరుడైన చంద్రమౌళి కుటుంబాన్ని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు పరామర్శించారు. శనివారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. చంద్రమౌళి ఆత్మకు శాంతి చేకూరాలంటూ భగవంతుని ప్రార్థిస్తూ నివాళులర్పించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పరవాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడి రైల్వేస్టేషన్ సమీపంలో గల ముళ్ల పొదల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. సుమారు 40 నుంచి 50 సంవత్సరాల వయసు గల మృతుడు బ్రౌన్‌కలర్ ఫుల్‌ప్యాంట్, వైట్‌కలర్ ఇన్నర్ బనియన్‌తో పాటు ఎరుపురంగు మొలతాడు ధరించి ఉన్నాడు. మెడలో హనుమాన్ వెండి బిళ్ల ఉంది. సుమారు నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం పూర్తిగా ఉబ్బిపోయి కుళ్లిపోయిన స్థితిలో ఉంది. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీలో భద్రపరిచినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. మృతుని సంబంధికులు ఉంటే తమను సంప్రదించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతురాలి చెవిదుద్దులు మాయంపై విచారణ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వృద్ధురాలి చెవిదుద్దులు మాయంపై పట్టణ పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ నెల 18వ తేదీన కొత్తూరు జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటనలో వృద్ధురాలి చెవికి ఉన్న దుద్దులు అదృశ్యమైన విషయాన్ని కుటుంబసభ్యులు పట్టణ పోలీసులు సమాచారం అందజేశారు. ఈ చెవిదుద్దులు ఎవరు మాయం చేశారనే అంశంపై విచారణ ప్రారంభించారు. ఇటు ఎన్టీఆర్ వైద్యాలయం ఉన్నతాధికారులు, అటు పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ విషయమై పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా వృద్ధురాలు చెవిదుద్దులు కనిపించడం లేదని బంధువులు సమాచారం ఇచ్చారని, ఫిర్యాదు ఇవ్వలేదన్నారు. అయినప్పటికీ సీసీ టీవీ ఫుటేజిల ఆధారంగా విచారణ చేపడుతున్నామని తెలిపారు.

బొగ్గు లోడుతో వెళుతున్న లారీ బోల్తా



కలపాక సమీపంలో బోల్తాపడిన బొగ్గులారీ

పరవాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పెదగంట్యాడ మండలంలో గల హిందూజా పవర్ ప్లాంట్‌కు బొగ్గు లోడుతో కొత్తవలస నుంచి శనివారం వెళుతున్న లారీ మండలంలోని కలపాక సచివాలయం సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఆ సమయంలో అటుగా వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. ఈ ఘటన జరిగిన సమయంలో ఆ వాహనంతో డ్రైవర్, క్లీనర్ ఉండగా, ఇద్దరూ అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయట పడ్డారు. ఈ మేరకు పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

34 మంది హెచ్ఎంలకు మెమోలు

పాడేరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పదో తరగతిలో ఉత్తీర్ణత 80 శాతం కంటే తక్కువగా ఉన్న 34పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మెమోలు జారీ చేసినట్టు డీఈవో పి.బ్రహ్మాజీరావు తెలిపారు. రాష్ట్ర సగటు ఫలితాలు కన్నా తక్కువ శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలను దృష్టిలో పెట్టుకొని ఈ మేరకు సంజాయిషీ కోరుతూ ఈ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. అలాగే, సబ్జెక్టుల వారీగా 80 శాతం కంటే తక్కువ ఫలితాలు సాధించిన ఆయా ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. అలాగే, సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు ఈ నెల 28వ తేదీ నుంచి జరగనున్న క్లాసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

ఘాట్ రోడ్డులో రక్షణ గోడల నిర్మాణం

- రూ.10 లక్షలు కేటాయించిన ఎన్‌హెచ్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కొందగుడ-ములియగుడ మధ్యలో నిర్మిస్తున్న గోడ

అనంతగిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రమాదకరమైన ప్రదేశాల వద్ద రక్షణగోడల నిర్మాణానికి జాతీయ రహదారుల సంస్థ రూ.10 లక్షలను కేటాయించి పనులు చేపడుతోంది. 'ఘాట్‌రోడ్డులో పొంచిఉన్న ప్రమాదం' అనే శీర్షికన గత మార్చి 27న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి ఎన్‌హెచ్ అధికారులు స్పందించారు.. కొదంగుడ-ములియగుడ మధ్యలోని సుమారు అడుగుల మేర.. కూలిన రక్షణగోడను నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఇతర ప్రదేశాల్లోనూ రక్షణగోడలను నిర్మిస్తున్నామని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. రక్షణగోడ నిర్మాణాలతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.. ఏడాదిలోగా బల్లుగుడ నుంచి అనంతగిరి మీదుగా వెంకయ్యపాలెం వరకు జాతీయ రహదారులు విస్తరణ పనులు ప్రారంభమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.. ఇప్పటికే, బల్లుగుడనుంచి నుంకరమెట్ట, భీసుపురం, అనంతగిరి మీదుగా రోడ్డును ఆనుకుని మార్కింగ్ సైతం వేశారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

జి.మాడుగుల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మత్స్యమాడుగులమ్మ ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రామరాజు, రెడ్డిబాబు మాట్లాడుతూ, ఈ పోటీల్లో 30 క్రీడా జట్లు పాల్గొనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగరాజు, సర్పంచ్ రాంబాబు, నాయకులు చిట్టిబాబు, కృష్ణమూర్తి, పిన్నయ్య, భీంబాబు, లక్ష్మణరావు, బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం మంచు .. మధ్యాహ్నం ఎండ

- పాడేరులో 37.5 డిగ్రీల ఉష్ణోగ్రత

పాడేరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మన్యంలో శనివారం ఉదయం 8 గంటల వరకు పొగ మంచు ఆ తర్వాత ఎండ తీవ్రత అధికంగా మారింది. దాంతో జనం ఎండ తీవ్రతకు అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రం పాడేరు, పెదబయలు మండలాల్లో శనివారం 37.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా కొయ్యూరులో 37.1, అరకులోయలో 36.3, డుంబ్రిగూడలో 36.2, జి.మాడుగులలలో 35.4, ముంచంగిపుట్టులో 35.1, చింతపల్లిలో 34.9, అనంతగిరిలో 34.4, హుకుంపేటలో 33.4, జీకేవీధి 31.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మైనారిటీల స్వయం ఉపాధికి దరఖాస్తులు ఆహ్వానం

పాడేరురూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైన్‌లు, పారసీలకు స్వయం ఉపాధికి (ఈఎస్ఎస్) అవకాశం కల్పిస్తున్నట్టు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు షాంసున్నీష బేగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా మైనారిటీకి చెందిన వారికి రూ. లక్ష నుంచి రూ. 8 లక్షల వరకు, క్రైస్తవ మైనారిటీకి చెందిన వారికి రూ. లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు వివిధ యూనిట్లు మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎంపికైన లబ్ధిదారుడికి 50 శాతం రాయితీ మంజూరు చేస్తారన్నారు. ఆసక్తిగల 21 నుంచి 55 ఏళ్ల లోపు వయస్సు గల అభ్యర్థులు దరఖాస్తుతో పాటు కుల, ఆదాయ, నివాస ధ్రువ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, అవసరమైన డ్రైవింగ్ లైసెన్స్ జతచేయాలన్నారు. వచ్చే నెల 25వ తేదీ లోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

డిప్యుటేషన్‌పై వైద్యాధికారి నియామకం

కొయ్యూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి డిప్యుటేషన్‌పై రెండవ వైద్యాధికారిగా యు.చీడిపాలెం ఆస్పత్రికి చెందిన హెమంత్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఎపిడమిక్ సీజన్ ఆరంభమై పీహెచ్‌సీకు రోగుల తాకిడి పెరిగింది. ఇక్కడ రెండో వైద్యురాలిగా పనిచేసిన మనోజ్ఞ ఆరు నెలల క్రితం డిప్యుటేషన్‌పై విజయనగరానికి వెళ్లిపోవటంతో ఖాళీ ఏర్పడింది. అప్పటినుంచి పీహెచ్‌సీలో సంపత్‌బాబు ఒక్కరే బాధ్యతలు నిర్వహించారు. దీం తో పరిస్థితి వైద్యులు కొరత ఏర్పడటంతో రోగుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా చొరవతో రెండో వైద్యుని డిప్యుటేషన్‌పై నియమించారు.

రూ.లక్షల వ్యయం.. నెరవేరని లక్ష్యం

- రూ. 40 లక్షలతో రాజేంద్రపాలెంలో సచివాలయ నిర్మాణం
- విద్యుద్దీకరణ పనులు పూర్తి కాక వదిలేసిన వైనం
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఫలితం



పది నెలుగా వృథాగా దర్శనమిస్తున్న సచివాలయ భవనం

కొయ్యూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో రూ. లక్షలు వెచ్చించి రాజేంద్రపాలెంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం వృథాగా మారింది. తుది దశలోని ఎలక్ట్రికల్ పనులు పూర్తి చేయక ఈ పరిస్థితి నెలకొంది. ఈ భవనానికి గత ప్రభుత్వ హయాంలో రూ. 40లక్షలు కేటాయించారు. కాంట్రాక్టరుకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో నాలుగేళ్లపాటు నిర్మాణం నత్తనడకన సాగింది. అనంతరం ప్రభుత్వం మారడంతో పెండింగ్ బిల్లులకు బ కాయిలు చెల్లించారు. ఈ మేరకు ఎం బుక్‌లో రికార్డు చేసిన మేరకు రూ. 40 లక్షలకు గానూ ఈ సచివాలయ భవనానికి రూ. 36 లక్షల మేర కాంట్రాక్టరుకు చెల్లింపులు జరిగాయి. ఈ స్థితిలో భవన నిర్మాణాలు పూర్తికాగా, విద్యుద్దీకరణ పనులు, ఫ్యాన్లు ఏర్పాటు, బిల్డింగ్ వెలుపల రంగులు వేయాల్సి ఉంది. ఈ పనులను గత పది నెలలుగా కాంట్రాక్టరను సంబంధిత ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది పూర్తి చేయాలని కోరుతున్నా పట్టించుకోని పరిస్థితి. దీంతో కళ్లెదుటే నూతన భవనం సిద్ధంగా ఉన్నా పాత బడిన పంచాయతీ భవనంలో చాలీ చాలని వసతితో సచివాలయ సిబ్బంది కాలక్షేపం చేస్తున్నారు. ఇకనైనా మిగిలిన పనులు పూర్తి చేసి భవనాన్ని పూర్తి చేసేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి

పాడేరురూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ధ్యానం, యోగా సాధన చేయడం ద్వారా ఒత్తిడినుంచి దూరంగా ఉండవచ్చని స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి విద్యార్థులకు సూచించారు. కళాశాలలో అకడమిక్ ఒత్తిడిపై విద్యార్థులకు శనివారం విద్యార్థి కౌన్సెలింగ్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎస్.రసూల్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ వి.కోటేశ్వరరావు విద్యార్థులకు పలుసూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గణేష్, దామోదరరావు, జానకీరావు, సౌజన్య, సుమిత్ర, గౌరీశంకరరావు, రమేశ్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

లువ్వాసింగిలో తాగునీటి పథకం ప్రారంభం

జి.మాడుగుల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలు సద్వినియోగించుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర, కె.సత్యనారాయణ సూచించారు. లువ్వాసింగి పంచాయతీ కేంద్రంలో శనివారం వారు గ్రావిటీ తాగునీటి పథకంతో పాటు డీఆర్‌డిపో భవనం ప్రారంభించారు. పంచాయతీ అభివృద్ధికి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పండుదొర, బంగారురాజు, కర్రిపడాల్, ఈశ్వర్‌పడాల్, చంద్రకళ, సన్యాసిపడాల్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భారీ అన్నసమారాధన



భక్తులకు భోజనం వడ్డిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

చింతపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. శనివారం ఆలయానికి వచ్చిన భక్తులు కమిటీ సభ్యులు, దాతలు సహకారంతో మధ్యాహ్నం భోజనాలు పెట్టారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురియా హేమంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పసుపులేటి వినాయకరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, కమిటీ సభ్యులు పైలా శ్రీనువాసరావు, తాటిపాకల రమేశ్, నాగేశ్వరరావు, తాడి రమణ పాల్గొన్నారు.

నెలాఖరు నాటికి ఈకేవైసీ పూర్తి చేయాలి: తహసీల్దార్

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నెలాఖరు నాటికి ఈకేవైసీ పూర్తి చేయాలని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. శనివారం రెవెన్యూ కార్యాలయంలో జీసీసీ సేల్స్‌మేన్లు, రేషన్ డీలర్, ఎండీయూ ఆపరేటర్లతో తహసీల్దార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల రేషన్ తీసుకోవాలంటే ప్రతి ఒకరు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు ప్రతి కుటుంబంలోనున్న సభ్యులందరికీ ఈకేవైసీ తప్పనిసరి అని అన్నారు. ఈ లక్ష్యాన్ని శతశాతం పూర్తి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ మహదేవ్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు బొర్రంపేట-లకారపుపాడు రోడ్డుకు మోక్షం



చురుగ్గా సాగుతున్న బీటీ రోడ్డు నిర్మాణం

కొయ్యూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : రెండు జిల్లాలను కలుపుతూ 2021లో మంజూరు చేసిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు పంచాయతీరాజ్ జేఈ రామకృష్ణ పర్యవేక్షణలో శుక్రవారం పునః ప్రారంభమయ్యాయి. జిల్లాల విభజనకు ముందు తూర్పు గోదావరి, విశాఖ జిల్లాలను కలుపుతూ కొయ్యూరు మండలం కొమ్మిక పంచాయతీ శివారు బొర్రంపేట నుంచి అప్పటి తూర్పుగోదావరి జిల్లా రాజవొమ్మంగి మండలం లకారపుపాడులను కలుపుతూ ఉపాధి పథకంలో సుమారు రూ. 2 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 60 లక్షలు మంజూరు చేశారు. రెండేళ్ల క్రితం సంబంధిత కాంట్రాక్టరు మట్టి పనులు చేసి మెటల్ స్టోన్‌డస్టు కలిపి రహదారిపై పరిచి నిర్మాణాలు నిలిపారు. గతంలో రెండు జిల్లాలను కలిపేందుకు ప్రతిపాదించిన ఈ రహదారి జిల్లాల విభజన అనంతరం అల్లూరి జిల్లాలో చేరింది. అయినా, దీని నిర్మాణాలు నిధులు లేమితో ముందుకు సాగలేదు.ఈ విషయాన్ని జనవరిలో 'ఆంధ్రజ్యోతి'లో ఈ రహదారికి మోక్షం లేదా శీర్షికన కథనాన్ని ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కూటమి ప్రభుత్వం ఇటీవల నిధుల నుంచి రూ 60 లక్షలు కేటాయించింది. దీంతో ఈ రహదారి నిర్మాణాలు చేపట్టి శనివారం సాయంతానికి రమారమి పూర్తి చేశారు. ఈ నిర్మాణాల తో రాజవొమ్మంగి మండలానికి చెందిన సుమారు 20 గ్రామాలతోపాటు కొయ్యూరు మండలంలో 40 గ్రామాలకు రాకపోకలు సులువతాయి. ఈ సందర్భంగా జేఈ రామకృష్ణ మాట్లాడుతూ ఈ రహదారి పూర్తి త్వరిగతిన పూర్తికి రెండు రోజులపాటు ఈ మార్గంలో రాకపోకలు సాగించకుండా సహకరించాలని ప్రజలకు సూచించారు.

30న పాలీసెట్

పాడేరురూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లమో కోర్సులలో ప్రవేశాల కోసం ఈ నెల 30వ తేదీన పాలిసెట్ నిర్వహిస్తున్నట్టు అల్లూరి జిల్లా కో- ఆర్డినేటర్, పాడేరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరులో 6 పరీక్ష కేంద్రాల్లో 1,313 మంది, చింతపల్లి ఒక పరీక్ష కేంద్రంలో 328 మంది, రంపచోడవరంలోని 2 పరీక్ష కేంద్రాలలో 385 మంది, చింతూరులో ఒక పరీక్ష కేంద్రంలో 115 మంది, ఎటపాకలో లో 294 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు ఆమె తెలిపారు. ఆన్‌లైన్‌లో హాల్‌టిక్కెట్‌లు రానివారుదరఖాస్తు రసీదుతో పాటు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 100, బీసీ, ఓసీ విద్యార్థులు రూ. 400, 2 పాస్‌ఫొటో సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డుతో సమీపంలో పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని సూచించారు. ఆరోజు పరీక్ష కేంద్రానికి నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించమని ఆమె స్పష్టం చేశారు. వివరాలకు ఫోన్: 94904 91157, 86392 06365 నంబర్లకు సంప్రదించాలన్నారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి హిమబిందు, సీడీపీవో జీవీ రమణ

చింతపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ధారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. శనివారం జాతరలో ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ స్టాల్‌లో సందర్శకులకు సీడీపీవో జీవీ రమణతో కలిసి వైద్యాధికారి పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. ప్రధానంగా బాలింతలకు శిశువులకు ముర్రుపాలు తాగించాలని కోరారు. ఆరు నెలల పాటు తల్లిపాలే రక్షణగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేయరాదన్నారు. స్టాల్‌లో ఏర్పాటు చేసిన నమూనా ఆస్పత్రి, అంగన్‌వాడీ కేంద్రం, గర్భిణుల వసతిగృహం, ఐసీడీఎస్ సేవల పోస్టర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈకార్యక్రమంలో ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు గౌహర్ ఉన్నీష, విజయకుమారి, అప్పలనర్స, గౌరి పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

పాడేరురూరల్, ఏప్రిల్ 26 ఆంధ్రజ్యోతి: సీఐ డి.దీనబంధు పర్యవేక్షణలో స్థానిక పోలీసులు శనివారం పాడేరులో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలను చేపట్టారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణీకుల లగేజీలను తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వాసుపత్రి, మోదకొండమ్మ ఆలయ పరిసరాలు, కలెక్టర్ కార్యాలయం, ఐటీడీఏ పరిసరాల్లో తనిఖీలను చేపట్టారు. అలాగే, పట్టణానికి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.

అరకు రైల్వేస్టేషన్ వద్ద..

అరకులోయ: కశ్మీర్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో పోలీస్‌శాఖ అప్రమత్తమైంది.. మండలంలోని అరకు రైల్వేస్టేషన్ వద్ద అరకు సీఐ హిమగిరి ఆధ్వర్యంలోని పోలీస్ సిబ్బంది డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. అన్ని ప్రదేశాలను క్షుణంగా తనిఖీలు చేశారు.. ఈ సందర్భంగా సీఐ హిమగిరి పర్యాటక ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు.. అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. పర్యాటక ప్రాం తాలను క్షుణంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. అనుమానితుల సంచరిస్తే సమాచారం అందించాలని స్థానికులకు సూచించారు.. అనంతరం ఎండపల్లివలస వద్ద మహిళల ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. సారా, గంజాయి దూరంగా ఉండాలని కోరారు. ఈయన వెంట ఎస్ఐ గోపాలరావు, తదితరులు ఉన్నారు.




అరకు రైల్వే స్టేషన్ ట్రాక్‌పై డాగ్ స్క్వాడ్ తనిఖీ

అపరిచితులకు ఆశ్రయం కల్పించొద్దు : ఎస్ఐ

ముంచంగిపుట్టు: అపరిచిత వ్యక్తులకు ఎవరూ ఆశ్రయం కల్పించరాదని స్థానిక స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక ప్రధాన రహదారిపై సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. ఛతీస్‌గఢ్ రాష్ట్రం కర్రెగుట్టలలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులు అధిక సంఖ్యలో మృతి చెందడం, పలువురు గాయాలు తగిలిన తప్పించుకుపోవడంతో సరిహద్దు ప్రాం తంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈస్థితిలో మండల కేంద్రం మీదుగా జోలాపుట్టు, పెదబయలు, కుమడ, లక్ష్మీపురం తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. పూర్తి వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సరిహద్దు గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని అన్నారు.

తాటిగుడలో వీధి లైట్లను పరిశీలించిన కేంద్ర బృందం



తాటిగుడలోని ఎల్‌ఈడీ వీధిలైట్లను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యుడు..

అనంతగిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిగుడ గ్రామంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎంపీ నిధులతో ఏర్పాటుచేసిన ఎల్ఈడీ వీధి లైట్లను కేంద్రం నుంచి వచ్చిన మూడో పార్టీపరిశీలన బృందం శనివారం త నిఖీ చేసింది. గ్రామంలోని వీధివీధికి తిరిగి.. ఎంపీ నిధులతో కొనుగోలు చేసిన లై ట్లు క్షేత్రస్థాయిలో పంపిణీ చేశారా... లేదా ? అనేదానిపై ఆరా తీస్తున్నట్టు కేంద్రం బృందం సభ్యుడు విజయన్ తెలిపారు. లైట్ల పనితీరు ఫొటోలు తీసుకున్నారు. వీరితో పాటుగా ఎంపీడీవో ఏవీవీ కుమార్, సర్పంచ్ రూతు, నాగులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సంధ్య, తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలతో ఎస్ఐ మమేకం

- చెరువు పనులు చేస్తూ.. వారి సాధక బాధలపై ఆరా



మట్టి తవ్వకాలు చేపడుతున్న ఎస్ఐ రామకృష్ణ

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ జె.రామకృష్ణ శనివారం ఉపాధి కూలీగా మారారు. మట్టిని తవ్వి, తట్టతో మోసి గిరిజనులతో మమేకమయ్యారు. వారి సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని సుజనకోట పంచాయతీ కొత్త సుజనకోట గ్రామ గిరిజనులు ఉపాధి పనులు చేస్తుండగా అటుగా తెల్లవారు జామున వాకింగ్‌కు వెళ్లిన ఎస్ఐఉపాధి కూలీగా మారారు. సుమారు గంట పాటు మట్టి పనులను చేశారు. పార, గునపం చేత పట్టి మట్టిని తవ్వడంతో పాటు ఆ మట్టిని మోస్తూ గట్టుపై వేశారు.ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. పో లీసు శాఖ ద్వారా చేపడుతున్న సేవలు, అభివృద్ధి కా ర్యక్రమాలను వారికి వివరించారు. గంజాయి జోలికి ఎవరూ వెళ్లరాదని, ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలన్నారు.సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని ఆయన హామీ ఇవ్వడంతో కూలీలు హర్షం వ్యక్తం చేశారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై జరిమానా



పాడేరులో వ్యాపారులకు జరిమానా విధిస్తున్న పంచాయతీ సిబ్బంది

పాడేరురూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న వ్యాపారులకు జరిమానాలు విధిస్తున్నట్టు ఈవోపీఆర్ అండ్ ఆర్డీ ఆర్‌వీఎస్. రమేశ్ తెలిపారు. కలెక్టర్ ఏఎస్. దినేశ్ కుమార్ ఆదేశాల మేరకు పాడేరు పంచాయతీలో ప్లాస్టిక్ వినియోగ నిషేధం విధించారు. అయినా, కొంత మంది వ్యాపారులు వాటి వినియోగాన్ని కొనసాగిస్తున్నారన్నారు. పాడేరు పంచాయతీ పరిధిలో శనివారం పలు దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టి సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న 30 షాపుల యజమానులకు రూ. 100 నుంచి రూ. 500 వరకు జరిమానా విధించారు. అలాగే, పాడేరులో శుక్రవారం జరిగిన వారపు సంతలో తనిఖీలను చేపట్టి 20 దుకాణదారులకు జరిమానాలను విధించినట్టు ఈవోపీఆర్డీ తెలిపారు. రెండోవ సారి పట్టుపడితే రూ. 500 నుంచి రూ. 1000 వరకు జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు అనుమతులు నిలుపు చేయాలని వినతి



ఎంపీడీవో సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న పెసా కమిటీ నేతలు

జి.మాడుగుల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అక్రమ కట్టడాల అప్రువల్స్‌ను నిలుపు చేయాలని పెసా మండల కమిటీ కోరింది. ఈ మేరకు మండల పెసా ఫోరం అధ్యక్షుడు లకే రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో కార్యాలయ ఉగ్యోగికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, మండల కేంద్రంతో పాటు ముఖ్య కూడళ్లలో ఇళ్లు, ఇతర అక్రమ కట్టడాలు పెరుగుతున్న దృష్ట్యా ఆయా పంచాయతీల నుంచి అప్రువల్స్, కరెంటు మీటర్ల కనెక్షన్లు ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పెసా ఉపాధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సెల్ సిగ్నల్స్ పనిచేయక అవస్థలు



గొల్లపల్లిలో టవర్ వద్ద ఆందోళన వ్యక్తంచేస్తున్న గిరిజనులు

సీలేరు, ఏప్రిల్ 26 , (ఆంధ్రజ్యోతి) : జీకే వీధి మండలం ఎ. ధారకొండ పంచాయతీ పరిధి గొల్లపల్లి గ్రామంలో గత వారం రోజుల నుంచి ఎయిర్‌టెల్ సిగ్నల్స్ పనిచేయక ఇబ్బంది ఎ దు ర్కొంటున్నట్టు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిగ్నెల్స్ అందక హౌసింగ్ సర్వేలోనూ సమస్యలు తలెత్తున్నట్టు తెలిపారు. ఫోన్లు పనిచేయక గ్రామంలో ఎవరైనా అనారోగ్యం బారిన పడినా, గర్భిణులను ఆసుపత్రికి తరలించాలన్నా అంబు లెన్సు కోసం పీహెచ్‌సీకి సమాచారం కూడా ఇవ్వ లేకపోతున్నామన్నారు. సంబంధిత కంపెనీ అధికారులు స్పందించి తమ గ్రామంలో ఉన్న ఎయిర్‌టెల్ టవర్ వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానం

కొయ్యూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ ఆధ్వర్యంలో 2025-26లో స్వయం ఉపాధి పథకంలో రుణాల ఎంపికకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. 50 ఏళ్లలోపుగల నిరుద్యోగులు ఎస్సీ కార్పొరేషన్‌కు మే 10వ తేదీ లోగా దరఖాస్తులివ్వాలన్నారు.

సొవ్వలో ఊట జలాలే దిక్కు

- మూలకు చేరిన కొళాయిలు.. కలుషిత నీటితో వ్యాధుల ముప్పు



ఊట నీటిని సేకరిస్తున్న గిరిజన మహిళలు

డుంబ్రిగుడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సొవ్వ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గిరిజనులకు తాగు నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ గ్రావిటీ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయిల ద్వారా తాగునీరు అందిస్తున్నట్టు అధికార యంత్రాంగం చెబుతున్న మాటలకు భిన్నంగా పరిస్థితి గ్రామాల్లో నెలకొన్నాయి. సొవ్వ గ్రామంలో కొళాయిలు, బోర్లు మూలకు చేరడంతో గ్రామంలో 550 కుటుంబాలకు ఉన్న ఒకే కొళాయినుంచి వస్తున్న నీరు దిక్కయింది. ఈ నీరు చాలక కలుషిత ఊటనీటిని సేకరించి గ్రామస్థులు తాగుతున్నారు. దీంతో వ్యాధుల బారిన పడుతున్నామని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులకు తాగు నీటి కల్పనపై చర్యలు తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాసరావు

గ్రామీణులకు ఇంజనీరింగ్ విద్య అవసరం

▸▸ మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మాకవరపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువతకు ఇంజనీరింగ్ విద్య ఎంతో అవసరమని అవంతి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం అవంతి కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు మట్టిలో లభించే వజ్రం లాంటి వారన్నారు. సాంకేతిక పరిజ్ఞానంలో ముందుడాలని చెప్పారు. విద్యార్థులు అకడమిక్స్‌లో మంచి ఉత్తీర్ణత సాధించినప్పటికీ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాన్ని మెరుగుపరచుకున్నడే విజయం సాధించగలుతారని చెప్పారు. వీటిని దృష్టిలో పెట్టుకొని త్వరితగతిన పరిశ్రమల్లో ఉద్యోగం సాధనకు కావాల్సిన నైపుణ్యం, ప్రణాళికలు రూపొందించుకోవడానికి ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంస్థల ప్రతినిధులు శ్రీనివాసరావు, కృష్ణచైతన్య, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లాలం అచ్చిరాజుకు స్పీకర్ అయ్యన్న పరామర్శ



ఏఎంసీ మాజీ చైర్మన్ అచ్చిరాజును పరామర్శిస్తున్న స్పీకర్ అయ్యన్న

నాతవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నలపాలెం గ్రామంలో కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నర్సీపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లాలం అచ్చిరాజును శనివారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు పరామర్శించారు. అచ్చిరాజు ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను వాకబు చేశారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

సుందరకోటలో లేటరైట్ తవ్వకాలు

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకరగణేశ్ ఆరోపణ



మాట్లాడుతున్న గణేశ్

నర్సీపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరకోటలో వందల కోట్లు విలువైన లేటరైట్ పేరుతో బాక్సైట్ తవ్వకాలు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ దోపిడీ వెనుక ఎవరి హస్తం ఉందో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ఒక హోటల్ యజమాని దీంట్లో కీలక పాత్ర వహిస్తున్నారని ఆరోపించారు. రాజమండ్రికి చెందిన ఒక కంపెనీతో వందల కోట్లు బేరసారాలు జరిగాయని ఆరోపించారు. గతంలో లేటరైట్ పేరులో జరుగుతున్న బాక్సైట్ తవ్వకాలపై టీడీపీ నాయకులు ఉద్యమాలు చేశారని, ఇప్పుడు తవ్వకాలపై స్పీకర్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

▸▸ ఎండీఎం సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.ప్రసన్న



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షురాలు ప్రసన్న

నర్సీపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.ప్రసన్న డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భోజన పథకం కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు, యూనిఫారాలు ఇవ్వాలని కోరారు. రాజకీయాలకు ముడిపెట్టి వేధింపులు, విధుల నుంచి తొలగింపులు ఆపాలని విన్నవించారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులు సత్యవతి, నూకరాజు, లక్ష్మీ పాల్గొన్నారు.

1100 మట్టి నమూనాల సేకరణే లక్ష్యం

▸▸ వ్యవసాయాధికారి కాంతమ్మ



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

దేవరాపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) మండలంలో 1100 మట్టి నమూనాలు సేకరించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నామని మండల వ్యవసాయాధికారి ఎల్.వై.కాంతమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని కొరుప్రోలు గ్రామంలో మట్టి నమూనాల సేకరణపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. పంట ఉన్న పొలంలో మట్టి సేకరణ చేయకూడదని ఈ సందర్భంగా ఏవో చెప్పారు. నీడ, నీరు నిల్వ ఉన్న చోట కూడా మట్టి తీయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3 లక్షలతో రిజర్వాయర్ గేటు మరమ్మతు

గొలుగొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రావణాపల్లి రిజర్వాయర్ గేటు మరమ్మతులకు రూ.3 లక్షలు మంజూరైనట్టు ఇరిగేషన్ ఈఈ బాలస్వామి, జేఈ రుత్తల రామన్నపాత్రుడు తెలిపారు. మండలంలోని రావణాపల్లి రిజర్వాయర్ గేట్లు, మదుములను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రిజర్వాయర్‌లో ఉన్న నీటి నిల్వలను గేట్ల ద్వారా పంపించినట్టు చెప్పారు. త్వరలో గేట్లు మరమ్మతులు చేపట్టి నీటి లీకేజీలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. మదుము ఏర్పాటుకు మరో రూ.20 లక్షల నిధులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వాయర్ చైర్మన్ రాజేశ్వరరావు, మాజీ సర్పంచ్ కొల్లు సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

▸▸ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు



కేజీబీవీ నూతన భవనానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో విద్యారంగం మరింత అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం మండలంలోని వేములపూడి కేజీబీవీ పాఠశాలకు నూతన భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ ఏడాది కాలంలో నర్సీపట్నం మండలంలో రూ.90కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిని 150 నుంచి 200 పడకలుగా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. వేములపూడి పీహెచ్‌సీ అప్‌గ్రేడ్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కొత్తబైయపురెడ్డిపాలెం నుంచి కోటవురట్ల మండలం కొత్తూరు గ్రామం వరకు పక్కా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, స్థానిక ఎంపీటీసీ సభ్యులు బోళెం రాంప్రసాద్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ సూర్యచంద్ర, సర్పంచ్ నక్కపల్లి నూకాలమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీరంగాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

భారీగా తరలివచ్చిన అభ్యర్థులు.. ఎంపికైన వారికి ఆఫరు లెటర్లు



ఆఫర్ లెటర్లు అందుకున్న ఉద్యోగార్థులతో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు స్థానిక యువత నుంచి విశేష స్పందన లభిస్తున్నది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ జూనియర్ కాలేజీల ఆవరణలో శనివారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి 945 మంది అభ్యర్థులు హాజరుకావడం విశేషం. జాబ్‌మేళాలో అరబిందో, హెటిరో ల్యాబ్స్, అపోలో ఫార్మసీ. పేటీఎం సర్వీస్, ఫ్లేక్లాన్, యోక్ల హామా, మహీంద్రా ట్రాక్టర్స్, దాయికిన్, గెలాక్సీ బిగ్ బాస్కెట్ వంటి కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ జాబ్‌మేళాకు నాలుగు మండలాల నుంచి 945 మంది హాజరుకాగా, 285 మంది వివిధ కంపెనీలలో జాబ్‌లకు ఎంపికయ్యారు. జాబ్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఆయా కంపెనీలు వెంటనే ఆఫర్ లెటర్లు కూడా అందించడంతో, వాటిని స్థానిక ఎమ్మెల్యే రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఐటీ కంపెనీలు కూడా రప్పించాలని అభ్యర్థుల సూచన

జాబ్‌మేళ్లాకు భవిష్యత్‌లో ఐటీ కంపెనీలు వచ్చేలా చూడాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతంలో ఐటీ కోర్సులు చేసిన అనేక మంది ఉన్నందున ఈసారి మేళాలకు ఐటీ కంపెనీలు హాజరయ్యేలా చూస్తే తమకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని, ఈ దిశగా నాయకులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఆఫర్ లెటర్లు వెంటనే అందించడంతో ఆఫర్ లెటర్ కొట్టిన వారిలో ఆనందం వ్యక్తమైంది.

భోజన వసతి ఏర్పాట్లు చేసిన ఎమ్మెల్యే

మెగా జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువతీ, యువకులు ఇబ్బంది పడకుండా ఎమ్మెల్యే రాజు సహకారంతో చేసిన ఏర్పాట్లతో అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున జాబ్‌మేళాకు వచ్చిన అభ్యర్థులందరికీ తాగినంత మజ్జిగను అందించడంతో పాటు భోజనాలు సమకూర్చారు. ఈ కార్యక్రమం విజయవంతానికి ఎంపీడీవో అంజనేయులు, ఈవోపీఆర్డీ మహేశ్, ఈవో నారాయణరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు శ్రమించారు. కార్యక్రమంలో గాంధీగ్రామం నాయకులు గోపి, డీకే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైరవిహారం

15 మందికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుక్క కాటు బాధితులు

దేవరాపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి 15 మందిని తీవ్రంగా గాయపర్చింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 8 గంటలలోపు పిచ్చి కుక్క వీరిపై దాడి చేసి గాయపరిచింది. గాయపడిన వారందరికీ ప్రభుత్వ ఆస్పత్రిలో రేబిస్ వ్యాక్సిన్ వేశారు. వివరాలిలా ఉన్నాయి.

దేవరాపల్లి బండారు వీధిలో కొళాయి నీరు పడుతున్న బండారు దీపికకు ఎడమ కాలుపై పలుచోట్ల గాయ పర్చింది. ఆమెను అతి కష్టంపై స్థానికులు కాపాడారు. మరిడిమాంబ కాలనీకి చెందిన జాగరపు ఉదయ్ కుమార్ (6), నిద్ర లేచి బయటకు వచ్చేసరికి పొట్ట, కాలు, చెవిలుపై గాయపర్చింది. కేకలు పెట్టి ఏడుస్తుండగా వెంటనే బాలుడు తల్లిదండ్రులు కాపాడారు. శంభువానిపాలెం నుంచి ఉపాధి పనులకు వెళ్తున్న ఉగ్గిన గాంధీని, నిద్ర లేచి మంచంపై కూర్చున్న ఇర్రా దేముడు, వడ్రంగి పనికి వెళ్తున్న బల్లంకి వెంకటరావు కుక్కకాటుకు గురయ్యారు. పాతరపల్లి కోటి, కొత్తూరు మహేష్, జి.అవినాష్, ఎస్‌కే.అబ్దుల్‌కలాం, ఎం.శ్యాం, నారాయణమూర్తి, యు.నిహారిక, సౌజన్య, రైవాడకు చెందిన ఎం.కృష్ణారావుతోసహా మరో వ్యక్తిపై కుక్క దాడి చేసింది. కుక్క కాటు గురైన వారందరికీ రేబిస్ వ్యాక్సిన్ వేసినట్టు వైద్యాధికారి పూజిత మేఘన తెలిపారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

చీడికాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేస్తే భవిష్యత్తులో గుర్తింపు ఉంటుందని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బాది తాతారావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్ష, కార్యదర్శులుగా బొడ్డు వరహామూర్తి, బొడ్డు జగ్గునాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నాయకులు పోతల రమణమ్మ, గండి ముసలినాయుడు, యర్రా అప్పారావు, భూసాల దేమున్నాయుడు, గాలి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

మాడుగుల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కె.రమాదేవి తెలిపారు. ప్రతీ శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించి సమస్యలపై అర్జీలను స్వీకరిస్తున్నట్టు ఆమె చెప్పారు. వాటిని పరిశీలించి వాటి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి ప్రజావేదికలో వచ్చిన అర్జీలను పరిశీలించి, వాటి పరిష్కారదిశగా చర్యలు తీసుకున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి అప్పారావు, ఎస్ఐ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో...

చీడికాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేక అధికారి కేవీఎల్ఎన్.మూర్తి అన్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో నలుగురు ఫిర్యాదుదారులను విచారించగా, అందులో రెండు సమస్యలు పరిష్కరించామని చెప్పారు. ఈ రెండు సమస్యలపై తర్వాత విచారణ చేసి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమసుందర్రావు, తహసీల్దార్ కిశోర్‌లింకన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వికాస డైరెక్టర్లు, సిబ్బందికి శిక్షణ

చోడవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వికాస పరస్పర సహకార బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బందికి సోమవారం నుంచి శిక్షణ ఇస్తున్నట్టు వికాస సంస్థ ప్రతినిధి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందువల్ల ఈ నెల 28 నుంచి ఐదు రోజుల పాటు బ్యాంకు కార్యాలయానికి సెలవు ఉంటుందన్నారు. సంఘం సభ్యులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉగ్రదాడులతో అప్రమత్తం



ఆర్టీసీ పార్శిల్ సర్వీస్ గోదాములో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

నర్సీపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్గామ్‌లో టూరిస్టులపై ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో పట్టణ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు శనివారం సాయంత్ర సీఐ గోవిందరావు ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ టీమ్, పోలీస్ సిబ్బంది వాహనాలు, ఆర్టీసీ పార్శిల్ గోదాములో డాగ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీలు చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్, జన సమూహం ఎక్కువగా ఉన్న కూడళ్లలో డ్రోన్ కెమెరాతో పరిశీలించారు.

లాడ్జీలలో తనిఖీలు..

చోడవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో శనివారం లాడ్జీలు, ప్రధాన ప్రాంతాల్లో సీఐ అప్పలరాజు, ఎస్ఐలు నాగకార్తీక్, జోగారావు తనిఖీలు నిర్వహించారు. లాడ్జీలలో ఉన్న వారి నుంచి వివరాలను సేకరించారు. వాహనదారుల రికార్డులను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లాడ్జీల యజమానులకు పలు సూచనలు చేశారు.

దేవరాపల్లి: మండల కేంద్రంలో ఎస్ఐ టి.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం వాహనాలు తనిఖీ చేశారు. ఉగ్రదాడుల నేపథ్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జమ్ములు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిపై ఉపాధ్యాయుల నిరసన



కొత్తూరు జంక్షన్‌లో ఉపాధ్యాయుల ఆందోళన

చోడవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పెహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ పట్టణంలోని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రమూకల దుశ్చర్యలను ఖండిస్తూ ఉపాధ్యాయులు నినాదాలు చేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం కొత్తూరు జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, నాయకులు మహలక్ష్మీనాయుడు, బి.దేముడుబాబు, గొల్లు శ్రీనివాసరావు, కె.మల్లేశ్వరరావు, ఆర్.చిరంజీవి, బీవీకే.కిశోర్, కోటేశ్వరరావు, శేషకుమార్, వరహామూర్తి, వెంకటరమణ, వంటాకు గోవిందరావు పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ సంఘాల ఉద్యోగులు, నాయకులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ.శ్రీనివాసరావు, నాయకులు డి.అప్పారావు, లోవరాజు, సత్యనారాయణ, చంద్రశేఖర్, కళ్యాణ్, శ్రీను పాల్గొన్నారు.

జూన్ 3న మోదకొండమ్మ జాతర



మాడుగుల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ జాతర జూన్ 3వ తేదిన నిర్వహించేందుకు చర్యలు తీసుకొంటున్నామని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. శనివారం కమిటీ సభ్యులతో నిర్వ హించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగా అమ్మవారి జాతర నిర్వహించేందుకు పురోహితులు భమిడిపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి తేదీ ఖరారు చేశారని చెప్పారు. జాతర అత్యంత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటు న్నామని, అందరూ సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

కమిటీల అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకోండి

▸▸ ఏఎంసీ చైర్మన్ అప్పలరాజు

మాడుగుల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా గ్రామ, మండల కమిటీల అధ్యక్షులు పదవులను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు సూచించారు. మాడుగుల వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ కమిటీ ఎన్నికలకు సంబంధించి పార్టీకి పనిచేసిన వ్యక్తులను గుర్తించి ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని చెప్పారు. ఈ నెల 28 నుంచి మే 6వ తేదీ వరకూ మండలంలోని 29 పంచాయతీల్లో ఈ కమిటీల ఎన్నిక జరుగుతుందని చెప్పారు. అలాగే పార్టీ అభివృద్ధికార్యక్రమాలపై చర్చించారు. గ్రామ కమిటీ ఎన్నిక అనంతరం మండల ఎన్నిక ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి మాడుగుల నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన ఏసుదాస్ పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు, కార్యదర్శి ఉండూరు దేముడు, మాడుగుల పట్టణ అధ్యక్షుడు రంజిత్‌వర్మ, పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేశ్, నాయకులు లెక్కల కాశిబాబు, సూర్యనారాయణరాజు, మరువాడ ఈశ్వరరావు, డిల్లీ నానాజీ పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై డ్రోన్‌తో వాహనాల తనిఖీలు

గొలుగొండ , ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాపై శనివారం డ్రోన్‌తో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. మండలంలోని చీడిగుమ్మల, ఎర్రవం, పాకలపాడు, జోగంపేట జంక్షన్‌లో రూరల్ సీఐ రేవతమ్మ ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలోని అన్ని రూట్లుతో పాటు ఆరిలోవ అటవీ ప్రాంతాల్లో డ్రోన్ సహాయంతో గంజాయి అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దీనిపై ప్రత్యేక పోలీసులతో రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామారావు పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

కె.కోటపాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కింతాడ గ్రామంలో శుక్రవారం రాత్రి టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. పార్టీ సీనియర్ నాయకులు బత్తి వెంకటరమణ, బండారు అక్కన్నపాత్రుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కన్నూరు సూర్యనారాయణ, కార్యదర్శిగా జోగా దేముడులను కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో ఎనిమిది మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారందరినీ గ్రామస్థులు సత్కరించారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

చోడవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడు శనివారం పోలీసులకు పట్టుబడ్డాడు. అల్లూరి జిల్లా హుకుంపేట మండలం రంగశీల పంచాయతీ టిట్టిగివలస గ్రామానికి చెందిన కొర్ర సన్యాసిరావు అలియాస్ సంజు 2022లో గంజాయి కేసులో నిందితుడు. అప్పటి నుంచి సంజు పరారీలో ఉన్నాడు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎస్ఐ నాగకార్తీక్ నిందితుడు సన్యాసిరావును పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

మరిడిమాంబ ఉత్సవం

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఏఎల్ పురంలో మరిడిమాంబ ఉత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు, చేశారు. ఎంపీటీసీ సభ్యులు బుల్లిప్రసాద్, మామిడి కృష్ణ, సర్పంచ్ లోచల సుజాత, ఆలయ గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

గొలుగొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. జోగంపేట జంక్షన్ నుంచి డౌనూరు మధ్య హుకుంపేట మలుపులో ఆటో, బైక్ శనివారం ఢీకొన్నాయి. ఆటో తిరగబడిందని, బైక్ యజమాని గాయపడ్డాడని పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి



యాదగిరి కనకరాజు (ఫైల్‌ఫొటో)

రావికమతం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్ మృతి చెందారు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున చిలకవానిపాలెంలో చోటుచేసుకుంది. కొత్తకోట ఎస్ఐ తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని టి.అర్జాపురం శివారు చిలకవానిపాలెం గ్రామానికి చెందిన యాదగిరి కనకరాజు (31) ఆటోతోపాటు తాపీ పనులు చేస్తుంటాడు. శనివారం తెల్లవారు జామున కనకరాజు అత్తవారి ఇంటి వద్ద ఉన్న భార్య, పిల్లల వద్దకు అని ఆటోలో దొండపూడి బయలుదేరాడు. టి.అర్జాపురం శాస్త్రిగారి మామిడి తోట సమీపంలో రోడ్డుపై కుక్క అడ్డంగా రావడంతో దానిని తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కనకరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలో పశువుల కల్లాల వద్దనున్న స్థానికులు కనకరాజును చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి ప్రైవేటు వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. కనకరాజు తండ్రి రాజిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. శవ పంచనామ అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. నాలుగేళ్ల క్రితం దొండపూడికి చెందిన రాజ్యలక్ష్మితో కనకరాజుకు వివాహం అయ్యింది. వీరికి నాలుగేళ్ల కుమారుడు తేజస్, 11 నెలల పాప దీక్షిత ఉన్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

శతాబ్ది సందడి

- ఏయూ శత వసంతాల వేడుకలు ఘనంగా ప్రారంభం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ప్రారంభోత్సవ కార్యక్రమంగా బీచ్‌రోడ్డులో ఉదయం కాళీమాత ఆలయం నుంచి ఏయూ కన్వెన్షన్ సెంటర్ వరకూ వాక్‌థాన్‌ను నిర్వహించారు. వీసీ జీపీ రాజశేఖర్, ఏయూ అధికారులు, పూర్వ ఉపకులపతులతో కలిసి ఈ వాక్‌థాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జయహో ఏయూ నినాదాలతో హోరెత్తించారు. ఏయూ ఖ్యాతిని తెలియజేసేలా ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపకులపతులు ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్, జీఎస్ఎన్ రాజు, బీల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. ఇక సాయంత్రం బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రధాన కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ శతాబ్దకాలంగా ఏయూ అనేక మంది జీవితాలను స్పృశించిందన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఐఐటీ పాలక్కాడ్ డైరెక్టర్ ఎ.శేషాద్రి శేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జాతీయ విద్యా విధానం డాక్యుమెంట్‌ను చదవాలన్నారు. ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ దార్శనికుల వారసత్వం, నాయకత్వం ఏయూను నడిపిస్తున్నాయన్నారు. ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ విభాగాలను మరింత బలోపేతం చేస్తామని వివరించారు. నిబద్ధతతో పనిచేస్తామని, ఏడాదిపాటు నిర్వహించే శతాబ్ది వేడుకలకు నోబెల్ గ్రహీతలను ఆహ్వానిస్తామన్నారు. ఈ సందర్భంగా ఏయూపై స్వయంగా ఆయన రాసిన కవితను చదివి వినిపించారు. ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ దీర్ఘకాలిక లక్ష్యాలను ఏర్పాటుచేసుకుని వాటిని సాధించే దిశగా పనిచేయాలన్నారు.

పూర్వ విద్యార్థుల సంఘం తరఫున వర్సిటీ అభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందిస్తామని చైర్మన్ కేవీవీ రావు అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, రెక్టార్ ఎన్.కిశోర్‌బాబు, మాజీ వీసీలు బీల సత్యనారాయణ, జీఎస్ఎన్ రాజు, శశిభూషణ్, ప్రిన్సిపాల్స్ ఎంవీఆర్ రాజు, సత్యనారాయణతోపాటు పలు విభాగాధిపతులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సీనియర్ ప్రొఫెసర్ శాంతమ్మ, మాజీ ప్రొఫెసర్ బి.ప్రసాదరావును సన్మానించారు. సెంటినరీ విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి నిర్వహించిన సెంటినరీ లోగో పోటీలకు సంబంధించిన విజేతను ప్రకటించారు. ఫైన్ ఆర్ట్స్ విద్యార్థి షేక్ రఫీ రూపొందించిన లోగోను ఏడాదిపాటు నిర్వహించనున్న వేడుకలకు వినియోగిస్తామని వీసీ ప్రకటించారు.

ఘనంగా నూకాంబిక ఘటాల మహోత్సవం



అమ్మవారి రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కొణతాల



కోలాటాలు ఆడుతున్న మహిళలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవంలో భాగంగా పట్టణంలో శనివారం సాయంత్రం భారీ ఎత్తున అమ్మవారి ఘటాల ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆధ్వ ర్యంలో అమ్మవారి పండుగను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న సందర్భంగా విశాఖపట్నం నుంచి హరిలక్ష్మి కోలాట బృందం సభ్యులు అధిక సంఖ్యలో ఘటాలతో వచ్చి ఊ రేగింపు నిర్వహించారు. పరమేశ్వరిపార్కు జంక్షన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై ఉత్సవమూర్తికి కొణతాల పూజలు చేసి ప్రారంభించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా మహిళా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి ఘటాలతో పురవీధుల గుండా ఊరేగింపుగా నూకాంబిక ఆలయానికి తరలివచ్చారు. పార్కు జంక్షన్ వద్ద ప్రారంభమైన ఘటాల ఊరేగింపు గవరపాలెంలోని పురవీధుల గుండా సాగిన అనంతరం అమ్మవారి ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా మహిళల కోలాటాలు, నేలవేషాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఆలయ సహాయ కమిషనర్ వెంపలి రాంబాబు, ఆలయ ధర్మకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఏటా రూ.100 కోట్లు తెస్తా..

» స్పీకర్ అయ్యన్నపాత్రుడు



మర్రిపాలెం సభలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నాతవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రతీ ఏడాది రూ.100 కోట్లు తీసుకువస్తానని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం మండలంలోని మర్రిపాలెం కస్తుర్బా గాంధీ పాఠశాలలో రూ.1.68 కోట్లతో నిర్మించనున్న అదనపు భవనాల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తాను మొదటి నుంచి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నానన్నారు.

తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ తాండవ రిజర్వాయర్ అభివృద్ధికి అయ్యన్నపాత్రుడు రూ.రెండు కోట్లు మంజూరు చేయించడంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నర్సీపట్నం జనసేన నాయకులు రాజాన వీరసూర్యచంద్ర మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు నాతవరం మండలంలో 167 సీసీ రోడ్లకు రూ.15 కోట్లు మంజూరు చేశారన్నారు. నాతవరంలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో వీవీ రమణ టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తహసీల్దార్ వేణుగోపాల్, మండల ప్రత్యేకాధికారి నాగశిరీషా, ఎంపీడీవో ఉషశ్రీ, కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారి భవానీ, మాజీ ఎంపీపీలు ఎన్ విజయ్‌కుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కోండ్రు మరిడియ్య, నాయకులు పారుపల్లి దాసు, బంగారు సూరిబాబు, అపిరెడ్డి మాణిక్యం, శెట్టి నానాజీ సామర్ల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలతో గ్రామీణ యువతకు ఉపాధి

» ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే రాజు
» చోడవరంలో మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ నిరుద్యోగుల ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషిచేస్తున్నదని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో శనివారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో నిరుద్యోగులను ఉద్దేశించి వారు మాట్లాడారు. చోడవరం నియోజకవర్గంలో ఎక్కువగా నిరుద్యోగులు ఉన్నారని, ఇటువంటి మెగా జాబ్‌మేళాలు తరచూ నిర్వహించడం ద్వారా వారందరికీ ఉపాధి అవకాశాలు దక్కేలా చూస్తామన్నారు. ఉద్యోగాలు రానివారు నిరాశ చెందనవసరం లేదని, వారు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ పొందాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్. గోవిందరావు మాట్లాడుతూ, శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 23 బహుళజాతి కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు. ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే రాజు ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులతో మాట్లాడి వారి విద్యార్హతలను అడిగి తెలుసుకున్నారు.

ఎంపికైన అభ్యర్థులకు ఆఫరు లెటర్లు

అభ్యర్థులకు కంపెనీలు అందించిన ఆఫర్ లెటర్లను స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అందించారు. ఈ మేళాకు 945 మంది అభ్యర్థులు హాజరుకాగా, 285 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ మహేష్, సీఐ అప్పలరాజు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, టీడీపీ నాయకులు మల్లునాయుడు, పెదబాబు, మత్స్యరాజు, జనసేన, బీజేపీ నాయకులు సిరిపురపు రమేష్, గూనూరు మూలినాయుడు, కందర్ప రమణమూర్తి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా పోలీసుల తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో డాగ్ ద్వారా తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జమ్ము కశ్మీర్ రాష్ట్రం పహల్గాం ప్రాంతంలో ఇటీవల జరిగిన ఉగ్ర దాడుల నేపథ్యంలో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు.

డీజీపీ హరీష్‌గుప్తా ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా నేతృత్వంలో అనకాపల్లి జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం విస్తృతంగా తనిఖీలు చేశారు. అనకాపల్లి రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో తనిఖీలు చేపట్టారు. డాగ్‌స్క్వాడ్ ద్వారా రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారంపై ఉన్న ప్రయాణికులను, వారి బ్యాగ్‌లను తనిఖీలు చేశారు. అనుమానస్పద వ్యక్తుల గురించి పోలీస్‌శాఖకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ తుహిన్‌సిన్హా కోరారు. ఈ తనిఖీల్లో ఎస్పీతోపాటు అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, పట్టణ, రూరల్ సీఐలు టీవీ విజయ్‌కుమార్, జి.అశోక్‌కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎస్. బాలసూర్యారావు, టౌన్ ఎస్ఐ ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడి తరలింపునకు సర్వే ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

పంచకర్ల ప్రసాద్ తహసీల్దార్ సమక్షంలో గ్రామస్థులతో గ్రామసభ నిర్వహించారు. సర్వేలో బినామీ పేర్లు లేకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. సర్వేకు గ్రామస్థులంతా సహకరించాలన్నారు. సర్వే పూర్తయిన వెంటనే నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తహసీల్దార్ వెల్లడించారు. సోమవారం నుంచి సర్వే పూర్తిస్థాయిలో చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బొడ్డపల్లి అప్పారావు, గనిరెడ్డి కనకారావు, కోమటి సూరిబాబు, బుగిడి రామగోవిందరావు, జుత్తుక మాధవరావు, పైలా కృష్ణారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తి భవనాలకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

అసంపూర్తిగా ఉన్నాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆయా భవన నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ఐదేళ్లలో ఈ భవనాల నిర్మాణానికి పైసా నిధులు కూడా కేటాయించలేదు.

అసంపూర్తి భవనాలు పూర్తి చేయాలని నిర్ణయం

జిల్లాలో అసంపూర్తి నిర్మాణాలతో ఉన్న 141 అంగన్‌వాడీ భవనాలకు రూ.9 కోట్ల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేస్తున్నట్టు ఇటీవల కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా అభివృద్ధి, మానిటరింగ్ కమిటీ వెల్లడించింది. దీంతో ఈ పనుల పూర్తికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిపై పీఆర్ ఈఈ వీరన్నాయుడును వివరణ కోరగా జిల్లాలో అసంపూర్తి అంగన్‌వాడీ భవనాలకు సీఎస్ఆర్ నిధులు మంజూరయ్యాయన్నారు. పరిపాలనపరమైన ఆమోదం లభించగానే పనులు ప్రారంభించి, పూర్తి చేస్తామని తెలిపారు.

మత్స్యకారులు రియల్ హీరోలు

... 5వ పేజీ తరువాయి

షెడ్ నిర్మిస్తామని, మత్స్యకారుల పిల్లల కోసం రెసిడెన్షియల్ హాస్టల్ కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. తీర ప్రాంతాల్లో పరిశ్రమలు రావడం వల్ల అభివృద్ధి జరుగుతుందని, మత్స్యకార ఓట్లు అధికంగా వున్న పాయకరావుపేట నియోజకవర్గం టీడీపీకి కంచుకోటన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు, నియోజకవర్గం మత్స్యకార నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మూడు ముళ్లతో బాల్యం బందీ

... 5వ పేజీ తరువాయి

ఉండడంతో పెళ్లి చేసేస్తున్నామని సమాధానం ఇచ్చారు. నర్సీపట్నం మండలం గురందొరపాలెంలో 17, 15 సంవత్సరాల బాలికలకు బాల్య వివాహాలు చేస్తుండగా అధికారులు అడ్డుకున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు. బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోనే అధికంగా బాల్య వివాహాలు జరుగుతున్నాయి. ఈ బాల్య వివాహాలన్నీ తల్లిదండ్రుల అనుమతితో కుటుంబ సభ్యుల సమక్షంలో జరుగుతుండడం గమనార్హం.

అవగాహన లోపంతోనే..

గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నాయి. నిరక్షరాస్యత, పేదరికం, దగ్గర సంబంధాలు ప్రధాన కారణంగా చెబుతున్నారు. వచ్చిన సంబంధం పోతే ఆడపిల్లకు పెళ్లి చేయడం కష్టం అన్న భావనతో తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తున్నారు.

చదువు ఆపేసి ఇంట్లో ఉంటున్న ఆడ పిల్లలతో తల్లిదండ్రులు అభద్రతా భావానికి గురవుతున్నారన్న విషయాన్ని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు గుర్తించారు. వలస కూలీలు అధికంగా ఉండే ప్రాంతాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నట్టు అధికారులు నిర్ధారించారు.

బాల్య వివాహం చేసినట్టు రుజువైతే...

18 ఏళ్ల లోపు బాలికను వివాహం చేసుకొని సంసారం చేస్తే పోక్సో సవరణ చట్టం-2019 సెక్షన్ 4(1) ప్రకారం పదేళ్లకు తక్కువ కాకుండా జైలు శిక్ష పడుతుంది. 16 ఏళ్లలోపు బాలికను వివాహం చేసుకుంటే అత్యాచారం కింద పరిగణించి 20 సంవత్సరాలకు తక్కువ కాకుండా జైలు శిక్ష పడుతుంది. జీవిత ఖైదు, జరిమానా విధించే అవకాశం ఉంది. బాల్య వివాహాలను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, పెద్దలు కూడా శిక్ష నుంచి తప్పించుకోలేరు.

సమాచారం అందించండి ఇలా..

ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో, తహసీల్దార్, ఆర్డీవో స్థాయి అధికారులకు, చైల్డ్ లైన్ 1098 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు. పోలీస్ కంట్రోల్ రూమ్ 100, 181 నంబర్లకు కూడా ఫోన్ చేసి చెప్పవచ్చు.

క్రైం... crime news

122 కిలోల గంజాయి స్వాధీనం

» ఐదుగురి అరెస్టు



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్పీ తుహిన్ సిన్హా

కొత్తూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం సంపతిపురం గ్రామ కూడలి వద్ద శనివారం మధ్యాహ్నం 122 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్టు చేశామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలోని పోలీస్ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి మండలం సంపతిపురం గ్రామ కూడలి వద్ద మధ్యాహ్నం 1.30 గంటలకు రూరల్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. అటుగా వస్తున్న ఆటోని తనిఖీ చేయగా 122 కిలోల గంజాయి లభ్యమైంది. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ పంచాయతీ పోల్‌గూడ గ్రామానికి చెందిన ప్రశాంత్ బారిక్, బోయిపరిగూడా గ్రామానికి చెందిన సుకాంత్ గౌడ్, దంగారచ్చి పంచాయతీ ముఖిఖుబ్ది గ్రామానికి చెందిన సుబర్ణ హరిజన్, దొరగూడ పంచాయతీ తిపగూడా గ్రామానికి చెందిన బతన్ హరిజన్, లెంజ మహలి గ్రామానికి చెందిన బాను కిలోలను నిందితులుగా గుర్తించామని తెలిపారు. కాగా వీరిలో ప్రధాన నిందితుడు ప్రశాంత్ బారిక్ పాత నేరస్థుడని తెలిపారు. గంజాయిని విశాఖపట్నం రైల్వేస్టేషన్ వరకు తరలించాలని ప్రణాళిక వేశారన్నారు. వీరిని చాకచక్యంగా పట్టుకున్న అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కుమార్, అనకాపల్లి ఎస్ఐ రవికుమార్, దేవరాపల్లి ఎస్ఐ బి.మల్లికార్జునరావు, రోలుగుంట ఎస్ఐ ఎండీ షాహీద్, స్పెషల్ పార్టీ పోలీసులు కె.ఆంజనేయులు, బి.ఉమామహేశ్వరరావులను ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సమావేశంలో అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న బైక్ : ఒకరి మృతి



చిటికెల సూరిబాబు (ఫైల్ ఫొటో)

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురం మరిడిమాంబ ఆలయ సమీపంలో శనివారం బస్సును బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఏఎల్‌పురానికి చెందిన చిటికెల సూరిబాబు(68) అలియాస్ సురేష్ వీధిరోడ్డు నుంచి తన బైక్‌పై ప్రధాన రహదారికి వెళుతున్న సమయంలో అదుపు తప్పి రాజమండ్రి-నర్సీపట్నం ఆర్టీసీ బస్సును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ వై.తారకేశ్వరరావు ప్రమాద వివరాలను సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఏలేరు కాలువలో పడి బాలుడి మృతి



సాయి (ఫైల్)

కశింకోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం సమీపంలో గల ఏలేరు కాలువలో పడి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఉమెన్ ఎస్ఐ రమణమ్మ శనివారం తెలిపిన వివరాలివి. సబ్బవరం మండలం గుల్లేపల్లి గ్రామానికి చెందిన కూండ్రపు సాయి(14) ఈ నెల 23న తాళ్లపాలెంలో ఉన్న తమ బంధువులైన అమరిపిల్లి అప్పారావు ఇంటికి వివాహ వేడుకకు వచ్చాడు. ఆ బాలుడు పెదవాల్తేరులోని ఓం శాంతి ఆశ్రమంలో చెవిటి, మూగ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆ బాలుడు ఈ నెల 25న ఉదయం 11 గంటల సమయంలో కాలకృత్యాల కోసం తాళ్లపాలెం ఏలేరు కాలువ గట్టుకు వెళ్తున్నానని తల్లి కూండ్రపు ఆదిలక్ష్మికి చెప్పి వెళ్లాడు. అయితే ఎంతకీ తిరిగి రాకపోవడంతో వెతకగా శనివారం ఉదయం 6 గంటల సమయంలో కోన నాగేశ్వరరావు మామిడితోట వద్ద ఉన్న ఏలేరు కాలువలో మృతదేహం తేలి ఉందని చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. శనివారం మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ చెప్పారు.

ఎయిమ్స్ తరహాలో కేజీహెచ్

... 5వ పేజీ తరువాయి

ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీచేశామని, ఇరువురూ ఆ పనిలో ఉంటారన్నారు. అదేవిధంగా కేజీహెచ్‌లో లెవెల్-2 క్యాన్సర్ సెంటర్ ఏర్పాటుకు రూ.60 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఇక్కడే సెంటర్ ఫర్ కాంపిటెన్స్ ఇన్ సికిల్‌సెల్ డిసీజస్ ఏర్పాటవుతుందన్నారు.

అనకాపల్లిలో కేంద్ర ప్రభుత్వం సాయంతో నైపర్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) సెంటర్ ఏర్పాటుచేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. అందుకు 50 ఎకరాలు కేటాయించామన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే 1923లో ఏర్పడిన ఆంధ్ర వైద్య కళాశాలలో ఎందరో మహామహులు చదువుకున్నారని, వారిలో కొందరి ఆలోచనలతో సెంటినరీ భవనం అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరి అలవాట్లు మారి ఆరోగ్యం కాపాడుకునే విధంగా తయారవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి తొలుత ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి స్వాగతం పలకగా, సెంటినరీ కమిటీ చైర్మన్ డాక్టర్ రవిరాజు భవనం నిర్మాణానికి చేపట్టిన కార్యక్రమాలు, పూర్వవిద్యార్థుల విరాళాల గురించి వివరించారు. మొత్తం 1.4 ఎకరాల్లో రూ.50 కోట్లతో నిర్మించిన భవన సముదాయంలోని రెండు బ్లాక్‌లలో నాలుగు అంతస్తులు ఉన్నాయన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈ భవనం కోసం గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ముందుచూపు ఉన్న చంద్రబాబునాయుడు నాయకత్వంలో విశాఖపట్నం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ కేజీహెచ్ అభివృద్ధికి ప్రభుత్వం మరింత సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడును సెంటినరీ కమిటీ సత్కరించింది. హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎన్టీఆర్ వైద్య సేవా వైస్ చైర్మన్ సుధాకర్, కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి పి.చంద్రశేఖర్, డీఎంఈ నరసింహం, కమిటీ సభ్యులు డాక్టర్ శశిప్రభ, ఎస్కే అప్పారావు, పెదవీర్రాజు, వెంకటాచలం, తదితరులు పాల్గొన్నారు.

డోలీ మోతలు ఇంకెన్నాళ్లు?

... 5వ పేజీ తరువాయి

చదువుతున్న గెమ్మెలి సింహాద్రి(9)కి పాఠశాలలోనే చేతులకు, శరీరానికి మొత్తం కురుపులు రావడంతో ఈ నెల 15న స్వగ్రామం నీళ్లబంధకు వచ్చేశాడు. గత నాలుగు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. నడవడానికి శక్తి కూడా లేదు. ఈ గ్రామానికి ఏఎన్ఎం, ఆశ కార్యకర్త కూడా రారు. వైద్యం చేయించుకోవాలంటే రోడ్డు సదుపాయం లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ బాలుడికి జ్వరం ఎక్కువ కావడంతో తండ్రి, తాతయ్య, మరో ఇద్దరి సహాయంతో ఆరు కిలోమీటర్లు డోలీలో మోసుకుంటూ ఎత్తైన కొండలు దాటి రావికమతం మండలం కుంజుర్తి గ్రామం వరకు వచ్చారు. అనంతరం కుంజుర్తి గ్రామం నుంచి మళ్లీ డోలీలో స్వగ్రామానికి ఆ బాలుడిని తీసుకువెళ్లారు. పింఛన్ తీసుకోవడానికి కూడా నీళ్లబంధ నుంచి పిత్రిగెడ్డ వరకు కాలినడకన వస్తున్నామని గిరిజనులు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434